రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## ఈ నెల 21నుంచి గ్రూపు-1 మెయిన్స్ పరీక్షలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబరు 16, ప్రభాతవార్త**

ఈ నెల 21నుంచి 27వ తేదీ వరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (గ్రూపు-1మెయిన్స్ పరీక్షలు జరుగనున్నట్లు, మొదటి పరీక్షకు ఉపయోగించిన అదే హాల్‌టికెట్‌ను మిగిలిన ఆరు పరీక్షలకు కూడ ఉపయోగించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. బుధవారం ఆయన పేర్కొంటూ గ్రూపు-1మెయిన్స్ పరీక్షలు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల్లో గుర్తించబడిన 46పరీక్షా కేంద్రాల్లో ఈ నెల 21నుంచి 27వ తేదీ వరకు పరీక్షలు జరుగనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగనున్నట్లు తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి హాల్‌టికెట్లు అందుబాటులో ఉంచబడినట్లు ఆయన వివరించారు. అభ్యర్థులు పరీక్షలకు మధ్యాహ్నం 12.30గంటల నుంచి 1.30గంటల వరకు పరీక్షా కేంద్రాలకు అనుమతిస్తారని, ఆ వెంటనే గేట్లు మూసివేయనున్నట్లు తెలిపారు. 1.30గంటల తరువాత ఎవరిని అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించటం జరగదని కలెక్టర్ స్పష్టం చేశారు.

## విద్యుత్ షాక్‌తగిలి ఇరిగేషన్ ఉద్యోగి మృతి

**ధారూర్, అక్టోబరు 16, ప్రభాతవార్త** విద్యుత్ షాక్ తగిలి ఇరిగేషన్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన ధారూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోట్‌పల్లి మండలం ఎన్కెపల్లి గ్రామానికి చెందిన ఇస్మాయిల్ (43) ఇరిగేషన్ శాఖలో లస్కర్ (కెనాల్‌హెల్పర్)గా విధులు నిర్వహిస్తున్నారు. అయితే బుధవారం మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టు కాలువలను ఇరిగేషన్ డిఈఈ భాస్కర్ గౌడ్‌ఏఈ వర్క్ఇన్‌సె ్పక్టర్లు కలిసి సర్వే చేస్తున్నారు. అయితే నాగసముందర్ గ్రామ సమీపంలో కాలువను సర్వే చేస్తుండగా సర్వేరాడ్ విద్యుత్ తీగలకు తగలి ఇస్మాయిల్ కిందపడ్డాడు. గమనించిన ఇరిగేషన్ ఏఈ వర్క్ ఇన్‌స్పెక్టర్ ధారూరులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరిశీలించి మెరగైన వైద్యం లేకపోవడంతో డిఈఈ కారులో వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి మార్గమధ్యలోని మరణించాడని ధ్రువీకరించారు. మృతుడికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భార్య హలీమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ సంగమేష్ తెలిపారు.

## డ్రోన్ ద్వారా సర్వేతో మాస్టర్ ప్లాన్‌కు రూపకల్పన



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్ జిల్లాప్రతినిధి ప్రభాతవార్త**

జిల్లాలో మున్సిపల్ పరిధిలో డ్రోన్ ద్వారా సర్వే చేసి మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలో మున్సిపల్ చైర్మెన్ మంజుల రమేష్, మున్సి పల్ అధికారుల సర్వే ఆఫ్ ఇండియా అధికారులు, డిటిసిపి అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రోన్‌కు పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు వికారాబాద్ జిల్లా అభివృద్ధిలో భాగంగా మున్సిపాలిటీకి సమస్యలు లేని మాస్టర్ ప్లాన్ తయారు అవుతుందని, భవిష్యత్ తరాలకు అన్ని డిజిటలైజ్ చేయడమే లక్ష్యమని అన్నారు. నూతన టెక్నా లజీ, డ్రోన్ కెమోరాల సహయంతో వికారాబాద్ మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ డిజిటల్ సర్వే పకడ్బందీగా క్యాప్చర్ చేయడం జరుగుతుందని, కేంద్ర ప్రభు త్వం అమృత్ 2.0స్కీమ్ కింద రాష్ట్రంలో 50 వేల నుంచి 1లక్ష జనాభా కలిగిన 20 మున్సిపాలిటీలను మాస్టర్ ప్లాన్ డిజిటల్ సర్వే చేయడం కోసం ఎంపిక చేయడం జరిగిందన్నారు. తెలంగాణా రాష్ట్రంలో మొదటిసారి వికారాబాద్ మున్సిపాలిటీలో మాస్టర్ ప్లాన్ డిజిటల్ సర్వే కార్యక్రమాన్ని ప్రారంబించడం జరుగుతుందని తెలిపారు. ఈ మాస్టర్ ప్లాన్ సర్వే సహ యంతో వికారాబాద్ పట్టణం అభివృద్ధి చెందుతుందని, చాలా సంవత్సరాల క్రితం రూపొందించిన ప్రణాళికలను ప్రస్తుత అవసరాలకు తగ్గట్టు మార్చేందుకు ఈ డిజిటల్ సర్వే చాలా ఉపయోగపడుతుందని అన్నారు. ఇప్పటికే ఉపగ్రహాల సహయంతో మున్సిపాలిటీ పరిధిలోని ప్రాంతాల వారిగా ఉపరితల ఎత్తు, పరిస్థితులు, రోడ్లు, ఇండ్లు, డ్రైనేజీ, తాగునీటి పైపులై న్లు, సెల్ టవర్స్, టాయిలెట్స్, రిజర్వాయర్లు, మార్కెట్‌లు, వైకుంఠధామా లు ఇలా ప్రతిదీ చిత్రాలతో విభాగాల వారిగా సేకరించి బేస్ మ్యాప్‌లను తయా రు చేస్తారు. దీన్ని ఆధారం చేసుకొని రాబోయే 30,40 సవంత్సరాల భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు అధికార యంత్రాంగం కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందించే పనిలో నిమగ్నమైంది అన్నారు. పట్టణాల అభివృద్ధి, సమస్యల పరిష్కారంలో ఈ బేస్ మ్యాప్‌లే కీలకం కానున్నాయని అన్నారు. అనం తరం కలెక్టరేట్ సమావేశం హాల్‌లో స్దానిక సమస్యలు అదనపు కలెక్టర్ సుధీర్, మున్సిపల్ చైర్మెన్ మంజుల రమేష్ సమావేశంలో పాల్గొన్నారు. డిప్యూటీ డైరెక్టర్ డిటి, సిపి రమేష్‌బాబు, పిపిటీ ద్వారా డ్రోన్ సర్వే ద్వారా ఏ విధంగా డేటా తీసుకోవాలి, పూర్తి వివరాలను తెలుపుతు డేటా తీసు కోవడంపై పూర్తి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్‌లు లింగ్యానాయక్, సుధీర్, సర్వే అఫ్ ఇండియా జాయింట్ డైరెక్టర్ భాస్కర్ చంద్ర, ఫరీదా, డిటిసిపి అడిషనల్ డైరెక్టర్ రమేషఫ్ బాబు, మున్సిపల్ ఇంచార్జ్ కమీషనర్ రాకేష్‌రెడ్డి, టిపిఒ వేణుగోపాల్, సర్వే అఫ్ ఇండియా అధికారులు, డిటిసిపి అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ చెంత.. డబుల్ బెడ్ రూమ్‌ల వింత

### తాళం వేసో్క.. తర్వాత చూసో్క
### మంజూరు లేకుండానే గృహ ప్రవేశాలు
### దసరా నుండి పాలు పొంగించి తాళాలు
### వేసుకుంటున్న దరఖాస్తు దారులు



**షాద్‌నగర్, ప్రభాతవార్త, అక్టోబరు 16 :** పక్కా ఇల్లు ఇప్పిస్తామని పక్కాగా నమ్మించారు... కొందరు వేలల్లో, మరికొందరు లక్షల్లో దరఖాస్తు దారుల నుండి డబ్బులు దండుకున్నారు. తీరా ప్రభుత్వం మారాక అర్హతల పరిశీలన మొదలైంది. ఈ నేపథ్యంలో డబ్బులు తీసుకున్న దళారుల వెంట దరఖాస్తు దారులు పడడంతో ముందువెళ్లి పాలు పొంగించి తాళాలు వేసుకోండి, తర్వాత ఎవరు వస్తారో చూసుకుందాం.. అంటూ దళారులు దరఖాస్తుదారులను ముందుకు తోస్తున్నారు. దీంతో ఎలాంటి మంజూరు లేకుండానే దరఖాస్తుదారులు రెండుపడకల ఇళ్లకు వెళ్లి పాలు పొంగించి గృహ ప్రవేశాలు చేస్తున్నారు. అనంతరం తమ సొంత తాళాలు వేసుకొని వెళ్తున్నారు. షాద్‌నగర్ పరిధిలో రెండు పడకల ఇళ్ల విషయంలో జరుగుతున్న తంతు ఇది. ఈ వింత కథలోనికి వెళ్తే..

**గతం ఇలా..**

షాద్‌నగర్ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో 1700లకు పైగా పక్కా ఇళ్లను నిరుపేదల కోసం నిర్మించారు. పట్టణంలోని ప్రశాంత్ నగర్ కాలనీతో పాటు సోలీపూర్, దూసకల్ ప్రాంతాలలో ఈ ఇళ్ల నిర్మాణం జరిగింది. నిర్మాణ సమయంలో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని నిరుపేదలకు సూచించారు. ఆ ప్రకారం వేలాది మంది పక్కా ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో దందా మొదలుపెట్టిన కొందరు దళారులు డబ్బులు ఇస్తే పక్కా ఇల్లు పక్కాగా ఇప్పిస్తామంటూ మభ్యపెట్టి దరఖాస్తు దారుల నుండి వారివారి స్థాయిని బట్టి డబ్బులను వసూలు చేశారు. ఇక పక్కా ఇళ్లను అప్పుడే మంజూరు చేయకుండా అప్పటి ప్రభుత్వం తాత్సారం చేయడం తర్వాత జరిగిన ఎన్నికల్లో కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రెండు పడకల ఇళ్ల విషయంలో గందరగోళం ఏర్పడింది. రెండు పడకల ఇళ్లను అనర్హులకు కేటాయించారంటూ కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేయడంతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పున: పరిశీలన ద్వారా లబ్దిదారులను ఎంపిక చేయాలని నిర్ణయించి కేటాయింపులు నిలిపివేశారు.

**వర్తమానం ఇలా..**

డబ్బులు తీసుకున్న దళారులు పక్కా ఇళ్లను ఇంకా ఇప్పించడం లేదని ఆరోపిస్తూ దరఖాస్తుదారులు వారి వెంట పడ్డారు. వారి నుంచి ఎలా తప్పించుకోవాలో అర్థంకాని దళారులు దరఖాస్తు ఫారాల్లో ఉన్న నెంబర్ల ప్రకారం ఇంటిని స్వాధీనం చేసుకోవాలని సూచించడంతో గత కొద్ది రోజులుగా దరఖాస్తుదారులు రెండు పడకల ఇళ్ల వద్దకు చేరుకొని పాలు పొంగించి, గృహ ప్రవేశం చేసి ఇళ్లకు తాళాలు వేసి వెళ్లిపోతున్నారు. ఒకవైపు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇళ్ల కేటాయింపు విషయంలో అడుగు ముం దుకు వేసి జిల్లా కలెక్టర్‌ను పిలిపించి పరిశీలన జరిపించిన కార్యక్రమం ఇటీవలే జరిగింది. అక్కడ పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేసి రెండు, మూడు నెలల్లో లబ్దిదారులను ఎంపిక చేసి ఇళ్లను ఇస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ దరఖాస్తులను పరిగణలోకి తీసుకొని అర్హులను ఎంపిక చేస్తామని పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ఇళ్లు ఇస్తామని చెప్పినప్పటికీ ఈ తొందరపాటు చర్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. దళారులు చేస్తున్న ఈ పొరపాటు వల్ల దరఖాస్తుదారులు తీవ్రంగా నష్టపో తున్నారు. మరోవైపు ఈ వ్యవహారం ఆందోళనకు దారితీసే పరిస్థితి కనబడుతుంది. అధికారులు తక్షణమే స్పందించి దీనిపై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఇంటికి తాళాలు వేసుకున్న దరఖాస్తుదారులు

## అన్యాయాలపై మౌనం వహిస్తే అందరూ బాధ్యులే

### టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 16) :** సమాజంలో ప్రతినిత్యం ఎక్కడో ఒకచోట మహిళలపై దారుణాలు జరుగుతున్నాయని, చిన్నా, పెద్ద తేడా లేకుండా కామాంధుడు విచ్చలవిడిగా రెచ్చిపోతున్నారని, ఇలాంటి అఘా యిత్యాలకు మొత్తం సమాజం బాధ్యత వహించాల్సిందేనని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని వివిధ విద్యాసంస్థలలో ప్రస్తుతం సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, అత్యా చారాలపై పలువురి అభిప్రాయాలు సేకరించారు. పట్టణంలోని బీఏఎం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ వెంకటయ్య గౌడ్, సీనియర్ లెక్చరర్ నాగరాజు, అధ్యాపకులు మశ్చిందర్, శ్రీకాంత్, వరలక్ష్మి, అఖిల, ప్రవీణ, తదిత రులతో మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పాపభీతి సన్నగిల్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. తప్పు చేస్తే సమాజంలో బతకలేము అనే భావనను కుటుంబ పెద్దలు గానీ, గ్రామ పెద్దలు గానీ నేర్పించడం లేదని, ఎవరికి ఏం జరిగితే మనకెందుకులే అని సులువుగా తీసిపారేయడంతో అఘాయిత్యాలు పెచ్చుమీరిపోతున్నాయని అన్నారు. కుటుంబ వ్యవస్థలో తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనకు కారకులుగా మారి చెడు మార్గాల్లో నడిచే విధంగా ప్రోత్సహిస్తున్నారని అన్నారు. పిల్లలకు చిన్నప్పటి నుండే మంచి చెడులను నేర్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పిల్లలకు సెల్‌ఫోన్లు ఇవ్వడం, సోషల్ మీడియాతో పాటు జల్సాలు చేసేందుకు ఎక్కువ డబ్బులు ఇవ్వడం, విచ్చలవిడిగా తిరుగుబోతులుగా ఉన్నప్పటికీ అతి గారాబం చేయడం వల్ల ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయని అన్నా రు. మనుషుల్లో పాపభీతి సన్నగిల్లిందని, సినిమాల ప్రభావం, పాశ్చాత్య ధోరణి, ఇంట్లో సంస్కృతి సాంప్రదాయాలకు భిన్నంగా కార్యక్రమాలు నిర్వహించడం లాంటి అనేక అంశాలు సమాజంలో జరిగే అఘాయి త్యాలకు ప్రోత్సాహకరంగా ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశ్యారు. కట్టుబొట్టు వ్యవహారం నుండి మొదలుకొని సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడిన నాడు కొంత అఘాయిత్యాలను నిర్మూలించవచ్చని అభిప్రాయ పడ్డారు. ముఖ్యంగా కళాశాల ప్రిన్సిపల్ వెంకటయ్య గౌడ్ మహిళా అధ్యా పకులు ప్రవీణ, వరలక్ష్మి, అఖిల, నాగరాజు, మంచి సూచన సలహాలు ఇచ్చారు. అన్ని విద్యా కేంద్రాలలో అభిప్రాయాలను సేకరించి చిన్ననాటి నుండి మంచి చెడు బోధించే విధంగా పాఠ్యాంశాలు పెట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుమార్ గౌడ్, పాల్గొన్నారు.



అధ్యాపకుల అభిప్రాయాలు సేకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే నర్సింహులు

## రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరణ

### మహేందర్‌రెడ్డి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసిన మధుసూదన్‌రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, అక్టోబరు 16 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్‌గా ఎలుగంటి మధుసూదన్ రెడ్డి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి హాజరై య్యారు. అనంతరం ఆయన ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు స్వీకరిం చారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల, తాండూర్ శాసన సభ్యులు కాలె యాదయ్య, బి.మనోహర్ రెడ్డి, టీయూఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహరెడ్డి, రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రియాజ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు



మధుసూదన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి

## పొట్ట కూటికోసం పొలిమేర్లు దాటిన వ్యవసాయకూలీలు

**నవాబుపేట అక్టోబర్ 16 ప్రభాతవార్త** పొట్టకూటికోసం బతుకుజీవుడా అంటూ పొలిమేర్లు దాటి కూలీకోసం కూలీలు నిత్యం మండలానికి వలస వస్తున్నారు. దీంతో స్థానిక రైతులకు కూలీల కొరత తిరుతోంది. స్థానికంగా కూలీల కొరత ఏర్పడటంతో తాండూర్, కుడుగుంట తదితర గ్రామాల నుండి మండల పరిధిలోని ఆయా గ్రామాలకు కూలీలురైలు మార్గం ద్వార రాకపోకలు సాగిస్తూ ఉపాధి పొందుతున్నారు. ఉదయం 7 గంటలకు చిట్టిగిద్ద రైల్వేస్టేషన్‌కు చేరుకునే డెమొ ప్యాసింజర్ ద్వార ఈ కూలీలు నిత్యం చేరుకుంటారు. దీంతో కూలీలు అవసరం ఉన్న రైతులు ఇక్కడి నుండి ఏర్పాటు చేసుకున్న వాహనాల ద్వార కూలీలను తరలించి వ్యవసాయ పనులు వెళ్ళదీసుకుంటారు. ఒక కూలీకి రోజుకు 500 రూపాయలు చెల్లిస్తారు. అదనంగా రాకపోకల ఖర్చు రైతులే బరించాల్సి వస్తుంది. సాయంత్రం తిరిగి హైద్రాబాద్ నుండి వచ్చే రైలుకు కూలీలు తమ ఇళ్ళకు చేరుకుంటారు. వారు గమ్యానికీ చేరుకునే సరికి దాదాపుగా రాత్రి 9 నుండి 10 గంటల సమయం అవుతోంది. ఈ నేపథ్యంలో ఇంటి పనులు చక్కదిద్దుకుని నిద్రపోయి తెల్లవారకముందేనిద్రలేచి వంటపనులు ముగించుకుని తిరిగి కూలీ కోసం దినచర్య ప్రారంభిస్తారు. పొట్టకూటికోసం సాగుతున్న బతుకుపోరాటంలో అలసటలేని పోరు సాగిస్తున్నారు. వారికి స్థానికంగా గిట్టుబాటు కూలీ లభించకపోవడంతోనే ఈ అగచాట్లు పడుతున్నట్లు చెబుతున్నారు. అందుకే కూలీకోసం వలస బాటపట్టినట్లు తెలిపారు. ఇక్కడ లభిస్తున్న కూలీ ద్వార కుటుంబాలను పోషిస్తున్నామని వారు అన్నారు. వేసవి కాలం తప్ప మిగిత రోజుల్లో చేతినిండా కూలీ పనులు లభిస్తాయని వారన్నారు. వేసవిలో కొంత ఇబ్బందిగానే ఉంటుందని కొందరికి మాత్రమే పని లభిస్తుందని అన్నా రు. ఇక్కడి రైతులు ఆరుగాలం కూరగాయల పంట సాగు చేయడంతోనే నిత్యం కూలీ పనులు చేసుకుని పొట్ట పోసుకుంటున్నామని చెప్పారు. అయితే స్థానికంగా కూలీల కొరత ఉండటంతో స్థానికేతరులకు ఉపాధి లభించడం విశేషం.



చిట్టిగిద్ద రైల్వేస్టేషన్ వద్ద కూలీ కోసం వచ్చిన కూలీలు

## ఎలికట్ట గ్రామ పంచాయతీకి మెమో జారీ



### ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన జిల్లా అధికారి సురేష్‌మోహన్

**షాద్‌నగర్‌రూరల్, అక్టోంబరు 16, (ప్రభాతవార్త) :** ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామ పంచాయతీని బుధవారం రంగారెడ్డిజిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో శానిటేషన్ నిర్వహణ, రిజిస్టర్ల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శి తేజస్వీని తీరుపై మండి పడి మెమో జారీ చేశారు. ఈ నోటీసులకు గాను సంజాయిషీ ఇవ్వాల్సిందిగా అధికారికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత మూడు నెలలుగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించటం లేదని, గ్రామ సభ మినిట్స్ పూర్తి చేయలేదని అన్నారు. అదేవిధంగా గత మూడు నెలల నుంచి క్యాష్ బుక్ వ్రాయడం లేదని అన్నారు. డీసీబీ రిజిస్టర్ మొదటి పేజీలో ధృవీకరణ లేదని, ఎంపీఓ ధృవీకరణ లేదని మండి పడ్డారు. పారిశుద్ధ పనుల్లో సహితం తడి, పొడి చెత్తలను వేరు చేయకపోవడం, గ్రామ పంచాయతీ నిర్వహణ సక్రమంగా లేకపోవడం ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మెమో ప్రతులను సంబంధిత ఉన్నతా ధికారులకు సహితం పంపించడం జరిగిందని ఆయన తెలిపారు. అనం తరం షాద్‌నగర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశం మందిరం లో మండల గ్రామ పంచాయతీ కార్యదర్శులతో, సంబంధిత అధికారులతో ముఖ్య సమావేశం నిర్వహించారు. గ్రామ సందర్శనలో జిల్లా అధికారి వెంట డీఎల్‌పీఓ మల్లారెడ్డి, ఎంపీడీఓ జయంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సమావేశానికి హాజరైన వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు

## 140 మంది కార్మికుల తొలగింపుపై ఆందోళన



**ఘట్‌కేసర్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ కమీషనర్ కార్మికుల సంక్షేమానికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని తెలంగాణ మున్సిపల్ కార్మిక సంఘం-ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్లూరి జయచంద్ర విమర్శించారు. ఘట్‌కేసర్ పురపాలక సంఘంలో పారిశుద్య పనులు నిర్వహిస్తున్న 140 మంది కార్మికులను విధుల నుంచి తొలగిస్తున్నట్లు బుధవారం కమీషనర్ సాబేర్‌ఆలీ జవాన్ల ద్వారా చెప్పడంతో కార్మికులు పని చేయకుండా అక్కడే ఉండి పోయారు. విషయం తెలుసుకున్న జయచంద్ర చేరుకొని కార్మికులతో మాట్లాడి కమీషనర్‌తో చర్చించి కార్మికులను విధులలోకి తిరిగి తీసుకోవాలని కోరారు. అనంతరం ఆయన మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులతో కలిసి ఆందోళన నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు ఉదయం నుంచి 8 గంటల పాటు విధులు నిర్వహిస్తుండగా ఘట్‌కేసర్‌లో మాత్రం ఉదయం 4 గంటలు, మధ్యాహ్నం 4 గంటల చొప్పున రెండు పూటలా పనిచేయిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులు నరసింహ్మా, ఎం.రాంచందర్, సువర్ణ, అరుణ, రాంకుమార్, అండాలు, బాలకృష్ణ, నాగేశ్, ఈరమ్మ, బాలనర్సిహ్మా, నాగమణి పాల్గొన్నారు.

## అంబేద్కర్‌నగర్‌లో దొంగతనం

**ఘట్‌కేసర్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** ఇంటి తాళం పగులగొట్టి బంగారం ఎత్తుకెళ్లిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ మున్సిపల్ అంబేద్కర్‌నగర్‌లో నివాసం ఉంటున్న లకావత్ సంపత్ దసరా సందర్భంగా ఈనెల 12న మధ్యాహ్నం తన కుటుంబతో కలిసి సొంతగ్రామం రఘునాధపల్లికి వెళ్లాడు. బుధవారం ఉదయం 5 గంటలకు తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం విరగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూశారు. గదిలోని బీరువా తాళం పగులగొట్టి వస్తువులు చిందరవందరగా చేసి ఉండటంతో చోరీ జరిగిందని నిర్ధారించుకున్నారు. బీరువాలో ఉండాల్సిన రెండు తులాల బంగారు పుస్తెలతాడు, నగదు కనిపించలేదు. దీంతో బాధితుడు సంపత్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు చేరుకొని పరిశీలించి వివరాలు సేకరించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఘట్‌కేసర్ ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

## ఇన్‌స్పెక్టర్ పరశురాంకు టిడిపి నేతల సన్మానం

**ఘట్‌కేసర్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.పరశురాంను టిడిపి నాయకులు సన్మానించారు. ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం తెలుగుదేశంపార్టీ మండలశాఖ మాజీ అధ్యక్షులు వేముల సంజీవగౌడ్ ఆద్వర్యంలో పలువురు నాయకులు సీఐని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. శాంతి, భద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని సీఐ వారిని కోరారు. ఈకార్యక్రమంలో మాజీ ఉపాధ్యక్షులు సామల జగన్మోహన్‌రెడ్డి, నాయకులు పాటి సురేందర్‌రెడ్డి, కొత్త బిక్షపతిగుప్త, కొత్త రాజేశ్వర్‌గుప్త, మడ్డి రాముగౌడ్, బత్తుల మహేశ్‌గౌడ్, గుర్జకు ంట చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఇద్దరు సీఐల బదిలీ

### వికారాబాద్ సిఐగా భీమ్ కుమార్, ధారూర్ సిఐగా రఘురాములు

**వికారాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** జిల్లాలో ఇద్దరు సీఐ లను బదిలీ చేస్తూ బుధవారం జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వికారాబాద్ జిల్లా ధారూర్ సీఐ గా పని చేస్తున్న బి.భీమ్‌కుమార్ ను వికారాబాద్ పట్టణ సిఐగా, వికారాబాద్ సిసిఎస్ సీఐ గా పని చేస్తున్న సి.రఘురాములను ధారూర్ సీఐ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో వికారాబాద్ సీఐ గా విధులు నిర్వహించిన నాగరాజు పలు ఆరోఫణలు ఎదుర్కోవడంతో పోలీసు ఉన్నతాధికారులు ఆయనను సస్పెండ్ చేశారు. నాగరాజు సస్పెన్షన్‌పై పలు రకాల రాజకీయ వత్తిడులు ఉన్నట్లు చర్చ కొనసాగింది. గత 15 రోజులుగా వికారాబాద్ సీఐ గా ఎవరు వస్తారనే సంశయం పట్టణ ప్రజల్లో నెలకొంది. ప్రస్తుతం బదిలీ పై వచ్చిన సీఐ భీమకుమార్ రాజకీయ వత్తిడులను ఎదుర్కొని విధులు సక్రమంగా నిర్వర్తిస్తారా..లేక రాజకీయ వత్తిడిలకు తలొగ్గుతారో వేచి చూడాల్సిందేనని పలువురు పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. భీమకుమార్ అంటే పోలీసు శాఖలో ఓ మార్కు ఉంది. ఎక్కడికి వెళ్ళిన నిక్కచ్చిగా విధులు నిర్వర్తిస్తారనే నానుడి ఉంది. వికారాబాద్ పట్టణ సీఐగా విధులు నిర్వర్తించాలంటే కత్తి మీద సాములా ఉంటుందనే ప్రచారం ఉంది. ఇటు అధికారుల నుంచి, అటు ప్రజా ప్రతినిధుల నుంచి తీవ్ర స్థాయిలో వత్తిడి ఉండటంతో.. వికారాబాద్ పట్టణ సీఐ గా విధులు నిర్వర్తించాలంటేనే పోలీసు అధికారులు వెనుకంజ వేస్తారు. ఇలాంటి పరిస్థితిలో భీమకుమార్ వత్తిడులను ఎదుర్కొని శాంతిభద్రతల విషయంలో పట్టణ ప్రజలకు ఏ విధంగా సేవలందిస్తారో కొన్నాళ్ళు వేచి చూడాల్సిందేనని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.

# నవంబరు 1న దీపావళి పండుగ జరుపుకోవాలి

**చార్మినార్,అక్టోబరు 16 ప్రభాతవార్త :**
దీపావళీ పండుగను ప్రజలు నవంబరు నెల 1వ తేదీన జరుపుకోవాలని శ్రీ గాయత్రీ విప్ర పండిత్ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పండితులు నిర్ణయించారు.హైదరాబాద్ పాతబస్తీ కోకరివాడిలో బుధవారం రాత్రి జరిగిన సమావేశంలో హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన వేద పండితులు (హిందీ భాషీయులు) పాల్గొన్నారు. ఈ సంవత్సరం అక్టోబరు నెల 29వ తేదీన ధంతేరస్,31వ తేదీన నరక చతుర్దశి (చిన్న దీపావళి) నవంబరు నెల 1న దీపావళీ పండుగను నిర్వహించుకోవాలని నగర ప్రజలకు పండితులు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో ప్రముఖ పండితులు భవానీ శంకర్ కోరియా,రామ్‌కిషన్ పాండేయ్,వేద ప్రకాష్ జోషీ,పురుషోత్తం శర్మ,విశేష్ శర్మ,గజానంద కృష్ణ శాస్త్రితో పాటు దాదాపు యాభై మంది పండితుల పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న శ్రీ గాయత్రీ విప్ర పండిత్ పరిషత్ ప్రతినిధులు,పలువురు వేద పండితులు

## డ్రైనేజీ సమస్యలను ఎప్పటికకప్పుడు పరిష్కరించండి
### : కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

**కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 16, ప్రభాతవార్త**
డ్రైనేజీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సంబంధిత అధికారులకు సూచిం చారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పీజెఆర్ నగర్ కాలనీలో డ్రైనేజీ కంట్రోల్ ట్యాంక్ పొంగి కాలనీలోకి చేరి ప్రజలకు ఇబ్బందికరంగా మారిందని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వెంటనే స్పదించి పీజెఆర్ నగర్ కాలనీలో పాదయాత్ర చేసి సమస్యను స్వయంగా పరిశీలించి జిహెచ్‌ఎంసి అధికారులతో మాట్లాడి క్లియర్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాన్ హోల్స్ అన్ని క్లియర్ చేసి నిల్వ ఉన్న నీటిని బయటకు పంపాలని, అలాగే కాలనీలో పెద్ద డ్రైనేజీ లైన్ నిర్మించి నీరు నిలిచిపోయే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మరెళ్ల శ్రీనివాస్, సంగమేస్, అగ్రవాసు, పోశెట్టిగౌడ్, వర్క్‌ఇన్స్‌పెక్టర్ రవికుమార్, సూపర్వైజర్ శివ, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఇంటర్నేషనల్ న్యూట్రీ-సెరియల్స్ కన్వెన్షన్

**అత్తాపూర్ అక్టోబరు16,ప్రభాతవార్త :** ఇంటర్నేషనల్ న్యూట్రీ-సెరియల్స్ కన్వెన్షన్ 6.0ను 17వ తేది నుండి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జీ డాక్టర్ .దయాకర్ పేర్కొన్నారు.బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్‌లోని ఐసిఎఆర్-ఐఐఓంఆర్ రిసెర్చ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురితో కలిసి ఆయన మాట్లాడు తూ.....ఈ మిల్లెట్ పరిశ్రమలో ఆవిష్కరణ,వ్యవస్థాపకత సహకారానికి ఉత్సాహభరితమైన వేదికగా ఉంటుందని తెలిపారు.న్యూట్రీ హబ్,(ఇండి యన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్స్)చే ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చడం జరుగుతుందని మూడు రోజుల జరిగే ఈ కార్యక్రమంలో మిల్లెట్ యొక్క అపారమైన సామర్థ్యాన్ని అన్వేషించడానికి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ,ప్రభుత్వ సంస్థలు,అంతర్జాతీయ ప్రతినిధులు ,విద్యావే త్తలు ,రైతులు ,పరిశ్రమలు ,స్టార్టప్‌ల నుండి కీలకమైన వాటాదారులను ఒకచోట చేర్చడమే లక్ష్యంగా పెట్టుకుందని ప్రపంచ మార్కెట్లలో 20 దేశాలు,అన్ని భారతీయ రాష్ట్రల నుండి ప్రతినిధులు కన్వెన్షన్‌కు హాజరవుతారని తెలిపారు.ఈవెంట్ యొక్క ప్రారంభం రోజు ఐసిఎఆర్ నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (ఐసిఎఆర్- నారం)ఐసిఎఆర్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ క్యాంప స్‌లలో ప్రారంభమతుందని తెలిపారు.

# 'మూసీ ' యుద్ధం

**-కాంగ్రెస్ వర్సెస్ బిఆర్ఎస్ -ప్రక్షాళన ప్రధాన అంశంగా పోటాపోటీ మీటింగ్‌లు**
**-కూల్చివేతలు అడ్డుకునేందుకు ప్రతిపక్ష బిఆర్ఎస్ ప్లాన్ -పనులు వేగవంతం చేసేలా అధికార పార్టీ వ్యూహం**
**-ఇంకా సందిగ్దంలోనే మూసి పరివాహక ప్రజలు-ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనని ఎదురుచూపు**



**హైదరాబాద్, అక్టోబరు 16,ప్రభాతవార్త:**
మూసీ ప్రక్షాళన అంశంగా కాంగ్రెస్ వర్సెస్ బిఆర్ఎస్ అంశంగా మారింది. అధికార కాంగ్రెస్ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని రివర్‌బెడ్‌లో నిర్మించిన ఇండ్లను కూల్చివేస్తుంది. అలాగే నిర్వాసితులకు డబుల్‌బెడ్‌రూం ఇండ్లు కేటాయిస్తుంది. అయితే ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీ దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ఈఅంశాన్ని తమకు అనుకూలంగా మార్చుకుని గ్రేటర్‌లో తమ పట్టుఎలాగైనా నిలుపుకోవాలని ప్రణాళికలు రచిస్తుంది. మూసీద్వారా తలెత్తే ఇబ్బందులు, నిర్వాసితులకు పునరావాసం అంశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్లాన్‌చేస్తుంది. ఈనేపథ్యంలో బుధవారం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ గ్రేటర్ హైదరబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి మూసి విషయంలో ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై చర్చించారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ ప్రభావం కోల్పోవడం ..వచ్చే ఏడాది డిసెంబర్‌లో జిహెచ్‌ఎంసి ఎన్నికలు జరగనుండటంతో ప్రజల్లోకి వెళ్లేందుకు హైడ్రా -మూసి అంశాలను బలమైన అస్త్రాలుగా వినియోగించుకోవాలని సమావేశంలో చర్చించినట్లు సమాచారం. అలాగే ప్రజా ఉద్యమాల ద్వారా పార్టీని వీడుతున్న ఎమ్మెల్యేలు,కార్పొరేటర్లను సైతం కాపాడుకోవచ్చునని బిఆర్ఎస్ భావిస్తుంది. మూసీ సుందరీకరణ వెనుక భారీ కుట్ర ఉందనే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన అంశాలు, అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించినట్లు తెలుస్తుంది. తాము అధికారంలో ఉన్నప్పుడు 16వేలకోట్లతో సుందరీకరణకు ప్రణాళిక చేశామని, దానిని రేవంత్‌సర్కార్ లక్షా యాభైవేలకోట్లకు పెంచిందని చెప్పడంతోపాటు..హైడ్రా కూల్చివేతల వల్ల హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగంసైతం కుదైలందన్న విషయాన్ని జనందృష్టికి తీసుకెళ్లాలని భావిస్తుంది.

**బిఆర్ఎస్ కుట్రలు తిప్పికొట్టేందుకు..**
మూసీ,హైడ్రా అంశాలను లేవనెత్తి ప్రభుత్వాన్ని అభాసుపాలు చేసేందుకు బిఆర్ఎస్ పార్టీ వేస్తున్న ఎత్తులను చిత్తుచేసేందుకు అధికార కాంగ్రెస్ సైతం అదే స్థాయిలో ప్రణాళికలు సిద్దం చేస్తుంది. ఈనేపథ్యంలో పిసిసి ఛీప్ మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం గ్రేటర్ పరిధిలోని కార్పొరేటర్లులతో సమావేశం నిర్వహించారు. బిఆర్ఎస్ హయంలోనే సుందరీకరణ పనులు అంశం తెరమీదకు వచ్చిందని మూసీ రివర్‌ఫ్రంట్ సైతం ఏర్పాటు చేసి దీనికి చైర్మన్‌ను నియమించి దానిపై లోన్ కూడా తీసుకుందనే విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కార్పొరేటర్‌లకు సూచించినట్లు తెలుస్తుంది. అలాగే మూసీ ప్రక్షాళన వల్ల మురికాల్వ పక్కన ఉన్న ఇంట్లో నుంచి డబుల్‌బెడ్‌రూం ఇండ్లలోకి వెళ్ళాలని..నిర్వాసితుల కుటుంబాలను ఆదుకోవడంతోపాటు, వారి పిల్లల చదువు, ఇతర సహాయసహకారాలు ప్రభుత్వం అందిస్తున్న విషయాన్ని స్థానిక ప్రజలకు వివరించాలని సూచించారు.మూసీని ఇలానే వదిలేస్తే హైదరాబాద్ నగర ఉనికికే ప్రమాదం ఏర్పడుతుం దని అందరిబాగుకోసం కలిసినడుద్దామన్న విషయాన్ని నగర జనాల్లోకి బలంగా తీసుకెళ్లాలని భావిస్తుంది.

**ప్రాణాలైనా ఇస్తాం..బుల్డోజర్లను రానీయం**
కాగా ప్రాణాలైనా ఇస్తాం కానీ .. బుల్డోజర్లను రానిచ్చేంది లేదంటూ మూసీ పరివాహక ప్రాంత వాసులు అంటున్నారు. తమకుడబుల్ బెడ్‌రూం



ఇండ్లు అవసరం లేదని స్పష్టం చేస్తున్నారు. రూపాయి రూపాయి పోగు చేసుకని ఇళ్లు కట్టుకున్నామని చెబుతున్నారు. మూసీనదివెంట ఉన్నది అందరం కూలీనాలి చేసుకునే వారమేనని తమను తీసుకుని ఎక్కడో వేస్తే ఏం చేసుకుని బతకాలని ప్రశ్నిస్తున్నారు. డబుల్‌బెడ్‌రూం అందజేసే ప్రక్రియ నెలల తరబడి సమయం పడుతుందని, అప్పటివరకు తాము ఎక్కడ ఉండాలని, ఎలా బతకాలి అని ప్రశ్నిస్తున్నారు. చైతన్యపురి ఫణిగిరి కాలనీ, న్యూమారితీనగర్ ,సత్యనగర్‌లలో ఇటీవల మూసి పరివాహక ప్రాంత ప్రజలు పోలీసులు, రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమకు విషం ఇచ్చి తమ ఇళ్లకు మార్కింగ్ చేసి తొలగించండి అంటూ ఆందోళన చేశారు. అలాగే మరికొందరు తమ ఇంటిని కూల్చేయకుండా అడ్డుకోవాలని, తమకు పునరావాసం కల్పించే వరకు ఆపాలని కోర్టుమెట్లు ఎక్కారు. దీంతో చాలా ఇండ్లకు ఈనెల 15,16తేదీవరకు కోర్టు స్టే ఇచ్చింది. ఇప్పుడు ఆగడువు ముగియడంతో రెవెన్యూ అధికారులు మళ్ళీ ఎలాంటి చర్యలు ప్రారంభిస్తారనే చర్చ జోరుగా సాగుతుంది.

# రాష్ట్రంలో 20వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీకి సన్నాహాలు

### -విద్యుత్ నియంత్రణ భవనాన్ని ప్రారంభించిన డిప్యూటీ సిఎం


కళ్యాణ్‌నగర్ కాలనీలో విద్యుత్ నియంత్రణ భవన్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**యూసుఫ్‌గూడ, అక్టోబరు 16, ప్రభాతవార్త :**
రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలో 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. వెంగళ్‌రావునగర్ డివిజన్ పరిధిలోని కళ్యాణ్‌నగర్ సమీపంలో తెలంగాణా ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ఆధ్వర్యంలో నిర్మించిన విద్యుత్ నియంత్రణ భవన్‌ను బుధవారం ఆయన ప్రారంభిచారు. ఈ సందర్భంగా జరిగిన న సభలో ఆయన మాట్లాడుతూ అతి తక్కువ ధరకే వినియోగదారులకు విద్యుత్ అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా నిరుపేదలపై ఎలాంటి విద్యుత్ భారాన్ని మోపకుండా చూడాలని విద్యుత్ ఉత్పత్తి చేసే అన్ని రకాల ఉత్పత్తులను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ మేరకు ఇప్పటికే నిరుపేదలకు 200 యూనిట్ల వరకు పేదలకు ఉచితత విద్యుత్‌ను అందించే కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని తెలిపారు. త్వరలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా విద్యుత్ అందించడానికి ఇప్పటి నుంచే అన్ని రకాల చర్యలను చేపడుతుందని పేర్కొన్నారు. ఇష్టానుసారంగా విద్యుత్‌ను ఖర్చు చేయకుండా ఉండేందుకు, పేదలకు భారం పడకుండా ఉండటానికి విద్యుత్ నియంత్రణ మండలి ఎంతో అనవసరమని అన్నారు. విదేశాల్లో ఉత్పత్తి చేస్తున్నట్టుగా సహజ వనరుల ద్వారా విద్యుత్ కాలుష్యం లేకుండా తయారు చేయడానికి యోచిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ తన్నీరు శ్రీనివాసరావు, మెంబర్స్ ఎం.డీ మనోహర్ రాజు(టెక్నికల్), బండారు కృష్ణయ్య(ఫైనాన్స్) తదితరులు పాల్గొన్నారు.

## పాతబస్తీ ఉప్పుగూడలో దసరా సమ్మేళనం

**చార్మినార్,అక్టోబరు 16 ప్రభాతవార్త :**
పాతనగర మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉప్పుగూడలో దసరా సమ్మేళనం జరిగింది. కార్యక్రమంలోరాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్,జిహెచ్‌ఎంసి డిసిపి శైలజ, మున్నూరు కాపు విద్యార్ధి వసతి గృహం ట్రస్టీ రాఘవేందర్,పాతనగర మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు ఆకుల శ్రీ రాములు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్

## జిహెచ్‌ఎంసి కమిషనర్‌గా ఇలంబర్తి
### అదనపు బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం

**హైదరాబాద్, అక్టోబరు 16,ప్రభాతవార్త:**
తెలంగాణలో ఆరుగురు ఏపీ క్యాడర్ ఐఏఎస్‌లను తెలంగాణ ప్రభుత్వం రిలీవ్ చేసింది. ఐఏఎస్ అధికారులు రోనాల్డ్ రోస్, ప్రశాంతి, అమ్రపాలి, విశాలాక్షీ , వాణీ ప్రసాద్ ,వాకాటి కరుణలను రిలీవ్ చేసి వారిస్థానంలో ఇంచార్జ్‌లను నియమించింది. ఈనేపథ్యంలో జిహెచ్‌ఎంసి కమిషనర్‌గా ఉన్న అమ్రపాలి స్థానంలో రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ కె.ఇలంబర్తికి అదనపు బాధ్యతలు ప్రభుత్వం అప్పగించింది.



## గజల్ శ్రీనివాస్ పాడిన "గేయ రామాయణాలు" ఆడియో ఆవిష్కరణ


ఆడియో ప్రతిని విడుదల చేస్తున్న శంకరాచార్యులు, గజల్ శ్రీనివాస్ తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 16,ప్రభాతవార్త:**
డా.గజల్ శ్రీనివాస్ స్వరపరిచి, గానం చేసిన పోతన విరచిత భాగవంతంలోని 108 ముఖ్య పద్యాలు, కవిత్రయం రచించిన ఆంధ్రమహాభారతంలోని 108 ముఖ్య పద్యాలు, డా.ముకుంద శర్మ వ్రాసిన గేయ రామాయణాల ఆడియోలను ఉత్తరాఖండ్ జ్యోతిర్మఠ్ శంకరాచార్య అవిముక్తేశ్వరానంద సరస్వతి స్వామి తిరువనంతపురం (కేరళ) పద్మనాభస్వామి ఏకాంత దర్శన అనంతరం వేలాదిమంది భక్తుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా శంకరాచార్య మాట్లాడుతూ సనాతన ధర్మంలోని అతిముఖ్యమైన రామాయణ, భారత, భాగవతాలు తెలుగు అడియోలను ఒకేరోజు ఆవిష్కరించడం అతిగొప్ప ధార్మిక కార్యక్రమం అన్నారు. వీటినీ స్వరపరిచి సందర్భ, తాత్పర్యసహితంగా అందరికీ అర్థమయ్యేలా గానం చేసిన డాక్టర్ గజల్ శ్రీనివాస్ అభినందనీయుడని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆడియో తొలిప్రతులను సిఎల్ రాజాం దంపతులకు, మిజోరామ్ పూర్వగవర్నర్ కుమ్మనం రాజశేఖర్‌లకు శంకరాచార్య అందించారు.

### మూసీ నిర్వాసితుల పిల్లలకు రెసిడెన్షియల్ స్కూళ్లలో ప్రవేశం

**హైదరాబాద్, అక్టోబరు 16,ప్రభాతవార్త:** మూసీ ప్రక్షాళనలో భాగంగా ఇళ్లు కోల్పోయిన రెండుకుటుంబాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రవేశం కల్పించారు. జిహెచ్‌ఎంసి అర్బన్ కమ్యూనిటీ విభాగానికి చెందిన పిఓలు, ఆర్‌పిలు, కృషితో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఎలాంటి ఎంట్రన్స్ పరీక్ష లేకుండా విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. 7వ తరగతికి చెందిన మాధవి, 8వ తరగతికి చెందిన శిరీష, 5వ తరగతిలో తేజ స్వీ ప్రవేశంపొందారు. వీరికి సరూర్‌నగర్ టిజి రెసిడెన్షియల్ పాఠశాలలో యుసిడి అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని స్కూల్‌లో చేర్పించారు.

### ఓపెన్ టెండర్ల ద్వారా కార్మిక హక్కులను కాపాడాలి


కార్మిక శాఖ జాయింట్ కన్వీనర్ సునీతకు వినతిపత్రాన్ని అందిస్తున్న మెట్రోవాటర్‌వర్క్స్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు నారాయణ

**చిక్కడపల్లి, అక్టోబరు 16 ప్రభాతవార్త:**
హైదరాబాద్ మెట్రోవాటర్‌బోర్డులో అర్హతలేని ఏజెన్సీలను రద్దు చేసి ఓపెన్ టెండర్ల ద్వారా కార్మిక హక్కులను కాపాడాలని, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మెట్రోవాటర్ వర్క్స్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు. బుధవారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఆవరణలో ఆ శాఖ జాయింట్ కమీషనర్ సునీత సమక్షంలో వాటర్‌బోర్డు అధికారులతో చర్చలు జరిపారు. కేటగిరి మార్పు, ఓటి సెలవులు, ఆరోగ్యబీమా, ప్రమాద బీమా, యూనిఫాం, సకాలంలో వేతనాలు, కార్మికులకు పరికరాలు, మీటర్ రీడర్లకు కేటగిరిమార్పు తదితర అంశాలపై చర్చించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కార్యకలాపాలను నిర్వహించే ఏజెన్సీల కాలపరిమితి పూర్తయినా కొనసాగడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన ఏజెన్సీలకు పొడగింపు ఇవ్వడం ఎంతవరకు సరైందో అధికారులే చెప్పాలన్నారు. వెంటనే పొడగింపు నిలిపివేసి ఓపెన్ టెండర్లు వేయాలన్నారు. టెండర్లలో కార్మిక చట్టాలను పొందుపరచాలని, కార్మికులకు అందుబాటులో ఉండి సేవలందించే విధంగా నిబంధనలను ప్రవేశపెట్టాలన్నారు. లేదంటే యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్, నాయకులు సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రాజ్,కుమార్, బాలకృష్ణారెడ్డి, రమేశ్, నరేశ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

### చిన్నారిపై వీధి కుక్క దాడి

**దుండిగల్, అక్టోబర్ 16 ప్రభాతవార్త:** దుండిగల్ పురపాలిక సంఘం పరిధిలో వీధి కుక్కలు బెంబెలెత్తిస్తున్నాయి. వారం రోజుల కిందట తండ్రి కొడుకుల మీద దాడికి యత్నించిన ఘటన మరువక ముందే బుధవారం ఓ చిన్నారిపై దాడి చేసి గాయపరిచాయి. ఐదవ వార్డుకు చెందిన మంత్రి క్రిష్ణవేణి, మధు దంపతుల నాలుగేళ్ళ కూతురు స్థానికంగా ఉన్న పాఠశాలలో ఎల్‌కెజి చదువుతోంది. పాఠశాల నుండి సాయంత్రం చిన్నారి ఇంటికి వస్తుండగా వీధి కుక్కలు దాడి చేసి చెవి, తల బాగంలో గాయపరిచాయి. గమనించి స్థానికులు కుక్కలను చెదరగొట్టడంతో చిన్నారికి ప్రాణపాయం తప్పింది. గాయపడిన చిన్నారిని వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా వీధి కుక్కల స్వైరవిహారంతో మున్సిపల్ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. బ్లూక్రాస్ సొసైటికి వీధి కుక్కలను అప్పగిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నప్పటికి దాడులు జరుగుతుండడంతో ప్రజల్లో ఆందోళన కలిగిస్తుంది.

# దంచికొట్టిన వర్షం ..పలుచోట్ల ట్రాఫిక్ జాం

**హైదరాబాద్, అక్టోబరు 16,ప్రభాతవార్త:**
నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం రాత్రి వర్షం కురిసింది. సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్ ప్యారడైజ్ ,మారేడ్‌పల్లి, చిలకలగూడ కుత్బుల్లాపూర్, సూరారం, ఖైరతాబాద్ ,బహదూర్‌పల్లి కొంపల్లి, ఎల్బీనగర్, దిల్‌షుక్‌నగర్, మలక్‌పేట్, చాదర్‌ఘాట్, కోటి, నారాయణగూడ, హిమాయత్‌నగర్ ,ఆర్టీసి క్రాస్‌రోడ్, ఉప్పల్ ,రామాంతపూర్, అంబర్‌పేట్ తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. వర్ష కారణంగా రహదారిపై నీరు చేరయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లక్డీకాపూల్ ,పంజాగుట్ట ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. జిహెచ్‌ఎంసి, డిఆర్‌ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగి ఆనీటిని నాలాల్లోకి మళ్ళించాయి.



## మహావిష్ణువును సాక్షాత్కరింపజేసిన నరసింహా కళ్యాణం నృత్యరూపకం


చెంచులక్ష్మీ నరసింహా కళ్యాణం నృత్యరూపకంలో ఒక దృశ్యం

**రవీంద్రభారతి, అక్టోబరు 16 ప్రభాతవార్త :**
మహావిష్ణువు నాల్గవ అవతారమైన నరసింహ భగవానుడిని సాక్షాత్కరింపజేసి సాంస్కృతిక పౌరాణిక వారస త్వాన్ని కళ్లకుకడుతూ ప్రదర్శించిన చెంచులక్ష్మీ నరసింహ కళ్యాణం నృత్యరూ పకం ప్రేక్షకులను ఆధ్యాత్మిక లోకంలో విహరింపజేసి మంత్రముగ్ధులను చేసింది. కళాకృతి నృత్యాలయ 11వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరిం చుకొని రవీంద్రభారతి ప్రధాన మందిరంలో జరిగిన నృత్యరూపక ప్రదర్శనా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృ తికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ విశిష్ట అతిథులు అనుపమ మోహన్, డి.జి.రాజబాబు, డిఆర్‌డిఓ సౌత్ హెడ్ మీలా యాదయ్య, సైంటిస్టు కె.రాంబాబు, నాట్యగురువు సుధీర్‌రావు, విక్రమ్‌కుమార్, కళాకృతి సంస్థ వ్యవస్థాపకురాలు భారతి తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి నృత్యరూపకాన్ని లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. నరసింహుని భయం కరమైన ఉగ్రరూపాన్ని శాంతి పరచడంలో ఎదురమ్యే సవాళ్లను ఈ నృత్యరూ పకం ద్వారా తెలుపడం శ్లాఘనీయమని, భారతదేశ పౌరాణిక, సాంస్కృతిక శాశ్వత వారసత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుందని అన్నారు. అనంతరం కళాకారులను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

**నార్సింగి, అక్టోబర్ 16 ప్రభాతవార్త :**
గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందాడు. ఈ సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్.ఐ ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్ జిల్లా కార్వాన్ ప్రాంతానికి చెందిన మహేష్, నిఖిల్‌లు రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం బండ్లగూడ కార్పోరేషన్‌లోని తమ స్నేహితులను కలిసేందుకు మంగళవారం వచ్చారు. తిరిగి బుధవారం తెల్లవారు ఝామున 3.గంటలకు తమ జూపిటర్ ద్విచక్రవాహనంపై సన్‌సిటీ నుంచి కార్వాన్‌కు బయలుదేరారు. టిప్పుఖాన్ బ్రిడ్జి సమీపానికి రాగానే గుర్తు తెలియని వాహనం అతివేగంగా వచ్చి వీరిని ఢీకొట్టింది. ఈ సంఘటనలో జూపిటర్‌పై వెనుకాల కూర్చున్న మహేష్ తలకు బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వాహనం నడుపుతున్న నిఖిల్ తలకు, కాలికి తీవ్రగాయాలయ్యాయి. వాహనదారులు ఈ ప్రమాదాన్ని గుర్తించి వెంటనే 100.కు ఫోన్ చేసి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న నార్సింగి పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. గాయాలపాలైన నిఖిల్‌ను ఓలివ్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ సతీష్ తెలిపారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు : నియోజకవర్గ ఇంఛార్జీ వజ్రేశ్ యాదవ్

**ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 16, ప్రభాత వార్త:** అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేందుకు ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇంఛార్జీ తోటకూర వజ్రేశ్ యాదవ్ అన్నారు. పోచారం మున్సిపల్ అన్నోజిగూడ ఎస్‌బీఆర్ గార్డెన్‌లో ఉమ్మడి ఘట్‌కేసర్ మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, బి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల మహేశ్ గౌడ్ తదితరులు విచ్చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇంఛార్జీ వజ్రేశ్ యాదవ్ మాట్లాడుతూ రెండు రోజుల్లోగా ఇందిరమ్మ కమిటీలు నియమాకం పూర్తి చేసి జబితాను తనకు అందజేయాలని కోరారు. ఇందిరమ్మ కమిటీల్లో ఐదుగురు పార్టీ నాయకులతో పాటు ఒకరు స్థానిక ప్రజాప్రతినిధి ఉండే విధంగా చూడాలని కోరారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు సక్రమంగా అందేలా ఈ కమిటీ పనిచేస్తుందని అన్నారు. పార్టీని నమ్ముకుని పనిచేసిన కార్యకర్తలకు అందరికీ ఏదో విధంగా న్యాయం జరుగుతుందని ఎవరు ఆందోళన చెందవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్, ఫీర్జాదీ గూడ మేయర్లు తోటకూర అజయ్ యాదవ్, అమర్‌సింగ్, ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం. పావని, పార్టీ నాయకులు కర్రె రాజేశ్, మాజీ వైస్ ఎంపీపీ కర్రె జంగమ్మ, వంగేటి ప్రభాకర్ రెడ్డి, డి. దయాకర్ రెడ్డి, పి. అమరేందర్ రెడ్డి, సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కె. వామన్ రెడ్డి, కె. వెంకట్ రెడ్డి, ఎం. ముత్యాల్ యాదవ్, శివకుమార్ గౌడ్, అబ్బసాని యాదగిరి యాదవ్, మశ్చేందర్ రెడ్డి, సింగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, ఎం. గణేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించాలి

**ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 16, ప్రభాత వార్త:** పోచారం మున్సిపాల్టీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ నగరంలోని హెచ్ఎండబ్ల్యూఎస్ కార్యాలయంలో ఎండీ. అశోక్‌రెడ్డిని బుధవారం కలిసి వినతి పత్రం అందజేసినట్లు చైర్మన్ కొండల్ రెడ్డి తెలిపారు. మున్సిపల్ చైర్మన్ కొండల్ రెడ్డితో పాటు కౌన్సిలర్ గొంగళ్ల మహేశ్, బీఆర్ఎస్ నాయకుడు నర్రీ కాశయ్యలతో కలిసి వెళ్లి ఎండీని కలిసి తాగునీటి సమస్యను శ్వాశాతంగా పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ పరిధిలోని ఇస్మాయిల్ ఖాన్‌గూడ, యంనంపేట్, పోచారం, నారపల్లిలో మిక్స్‌డ్ వాటర్ వస్తున్నందున బిల్లులు తక్కువ వేయా లని, బలహీన వర్గాల కాలనీల్లో పైపులైన్ కొత్తగా ఏర్పాటు చేసి, అవసరమైన చోట ట్యాంకులు ఏర్పాటు చేసి సరిపడా నీటిని అందించాలని కోరుతూ ఎండీకి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.

### కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్ధతు ధర

**బొంరాస్‌పేట్, అక్టోబర్16, ప్రభాతవార్త :** కొడంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, పిఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ అధ్వర్యంలో బొంరాస్‌పేట్ మండలం తుంకిమెట్ల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యంను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని, దళారులను నమ్మిరైతులు నష్టపోవద్దని వారు సూచించారు. తుంకిమెట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో దొడ్డు రకం వడ్లతోపాటుగా సన్న వడ్లను కూడ కొనుగోలు చేయడం జరుగుతుందని వారి తెలిపారు. సన్న రకం వడ్లకు ప్రభుత్వం అదనంగా ఐదువందల రూపాయాల బోనస్ ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ వెంకట్‌రాములుగౌడ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నాయకులు అంజిల్‌రెడ్డి, వ్యవసాయ కమిటి మెంబర్ మల్లేషం, రాంరెడ్డి, నర్సిమనాయుడు, బాల్‌రాజ్‌గౌడ్, వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వహించాలి

**బొంరాస్‌పేట్, అక్టోబర్16, ప్రభాతవార్త :** బిఎస్సి–2024 ద్వార ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు బొంరాస్‌పేట్ మండల ఉపాధ్యాయ సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మండల విద్యావనరుల కేంద్రం అవరణలో విద్యాధికారి హరిలాల్ అధ్వర్యంలో నూతనంగా 9స్కూల్ అసిస్టెంట్స్, 17మంది ఎస్‌జీటీలకు వివిధ పాఠశాలలకు సంబంధించిన జాయినింగ్ రిపోర్టు అందజేశారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాల నాయకులు నూతనంగా జాయినింగ్ అయిన వారికి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందని యూటీఎఫ్ నాయకులు గౌరారం గోపాల్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనం 10వేల మంది ఉపాధ్యాయుల నియామకాలను పూర్తిచేయడం చాలా అభినందనీయం అన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసాన్ని పెంచాలని, పాఠశాలలకు పూర్వవైభవం తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు అనిల్‌కుమార్, బాకారం చంద్రశేఖర్, నరేందర్‌గౌడ్, శశిధర్, వెంకటేష్, శివరాజ్, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం

**దుద్యాల్, అక్టోబర్16, ప్రభాతవార్త :** దుద్యాల్ మండలం పోలేపల్లితాండలో గత 3రోజుల నుండి కొనసాగుతున్న నూతన శ్రీఅం జనేయ, గణపతి, ఈశ్వర, నంది, శిఖర, ధ్వజస్థంభం విగ్రహల ప్రతిష్టాపన మహోత్సవాలు వేదపండితుల అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దేవతమూర్తులకు సహనం, ప్రాణప్రతిష్ట, యంత్రప్రతిష్ట, మూర్తిప్రతిష్ట, పూర్ణహుతి, హోమాలు, హరతి, ఆశీర్వచన కార్యక్రమాలను తాండవాసులు ఘనంగా నిర్వహించారు. ప్రతిష్టాపన కార్యక్రమంలో తాండవాసులతోపాటు వివిధ గ్రామాల ప్రజలు, యువకులు అధికసంఖ్యలో హాజరుకావడం జరిగింది. విగ్రహదాతలు, అన్నదానం, ప్రతిష్టాపనకు సహకరించిన గ్రామస్తులు, యువకులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వేదపండితులతో ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాండవాసులు పాల్గొన్నారు.

## సియం సయహా నిధి పేదలకు వరం

**మాడ్గుల, అక్టోబరు 16, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు వరంగా మారిందని ఆమన్‌గల్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్, మాడ్గుల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు భట్టు కిషన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆర్కపల్లి గ్రామపంచాయితీ పరిదిలోని అశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఈర్లపల్లి జగన్ ఇటీవల ఆనారోగ్యానికి గురై అస్పత్రిలో చిక్సిత చేయించుకున్నారు. దీంతో ఆర్థిక ఇబ్బందులకు గురై సియం సహాయక నిధికి దరఖాస్తు చేసుకున్నారు. సియం సహాయక నిధి నుండి మంజూరైన 60వేల చెక్కును బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యాక్రమంలో మాజీ వార్డు సభ్యులు తోలు జంగయ్య, జగన్ తదితరులు పాలోన్నారు.

### కొల్కులపల్లి పాఠశాలలో కళావేదిక ప్రారంభం

**మాడ్గుల, అక్టోబరు 16, ప్రభాతవార్త:** కొల్కులపల్లి ఉన్నత పాఠశాలలో మురుకుంట్ల వెంకట సుబ్బయ్యశర్మ స్మారక కళావేదికను ఆమన్‌గల్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భట్టు కిషన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భట్టు అనురాధ కిషన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామనికి చెందిన పూజారి వెంకటసుబ్బయ్య శర్మ ప్రథమ వర్థంతి సందర్భంగా ఆయన కుమారులు సీతరామశర్మ, రవిశర్మలు తన తండ్రి పేరు గ్రామాస్తులకు గుర్తుండేవిధంగా కళావేదిక నిర్మించడం అభినందనియం అన్నారు. నిర్మాణనికి 1.20వేలు ఖర్చు చేసినట్లు వారు తెలిపారు. అనంతరం కొల్కులపల్లి గ్రామానికి చెందిన విశ్రాంతి తెలుగు అధ్యాపకులు మసన చెన్నప్ప రచించిన మానవతా మూర్తి పేరుతో రచించిన పుస్తకాన్ని మాజీ సర్పంచ్ అనురాధ కిషన్‌రెడ్డి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులకు అందజేసి ఆవిష్కరించారు. చెన్నప్ప, భద్రయ్య, సర్సి రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బాల్‌నారయణ తదితరులు పాల్గొన్నారు.

### పారిశుద్ధ్య కార్మికులకు ఉచితంగ బట్టలు పంపిణీ

**శామీర్‌పేట, అక్టోబరు 16, ప్రభాతవార్త**

తుర్కపల్లి గ్రామపంచాయతీ కార్మికులకు దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని ఉచితంగ బట్టలను తుర్కపల్లి గ్రామ బిజెపి నాయకులు బి. శ్రీనివాస్ పంపిణీ చేశారు. బుధవారం శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లి గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు దసరా పండుగ, దీపావళి పండుగలను పురస్కరించుకుని వారికి ఉచితంగ బట్టలు పంపిణీ చేయటం జరిగిందన్నారు. దీనిలో ఆయనతో పాటు ఎన్. అశోక్, నర్సింగ్, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



నందిగామలో పోచమ్మతల్లి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్

## సకల దేవతల ఆశీస్సులు అందరికీ కలగాలి

### విగ్రహప్రతిష్టాపన వేడుకల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**నందిగామ, అక్టోబరు 16 ప్రభాతవార్త** సకల దేవతల ఆశీస్సులతో సర్వ కార్యక్రమంలో విజయం సిద్ధించాలని అమ్మోరు తల్లి అందరినీ చల్లగా చూడాలని ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ మొక్కుకున్నారు. బుధవారం నందిగామ మండల కేంద్రంలో ఉన్న గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై పూజలు చేశారు. ఈ వేడుకల్లో ఉమ్మడి మండలాల మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్ మాజీ ఎంపిటిసి కొమ్ము కృష్ణ దేవల్లె కుమారస్వామి గౌడ్ నాయకులు జిల్లెల్ల రామ్‌రెడ్డి బి లక్ష్మయ్య యాదవ్ జె సుదర్శన్ గౌడ్ జంగ నరసింహులు చెంది తిరుపతిరెడ్డి బొమ్మగల నర్సింలు కుందారం వెంకటేరెడ్డి నవపేట్ రవీందర్ గౌడ్ శివగల్ల సుమన్ చిందం నర్సింలు చాకలి నరసింహులు ఎస్టిసెల్ శ్రీను నాయక్ జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

## వైభవోపేతంగా అమ్మోరు తల్లికి పూజలు

### వేడుకల్లో పాల్గొన్న బిజెపి నేత పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

**నందిగామ, అక్టోబరు 16 ప్రభాతవార్త** నందిగామ మండల కేంద్రంలో గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్టాపన వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో కొన సాగాయి. నందిగామలో పోచమ్మ గుడిని బిజెపి సీనియర్ రా ష్ట్ర నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి సందర్శించి పూజలు చేశారు. అమ్మవారు అం దరినీ చల్లగా చూడాలని మొక్కుకున్నారు. వేడుకల్లో మాజీ సర్పంచ్‌లు జిల్లెల్ల వెంకట్‌రెడ్డి వంకాయల రామన్న మాజీ ఎంపిటిసిలు చంద్రపాల్‌రెడ్డి జిల్లెల్ల దామోదర్‌రెడ్డి మాజీ ఉపసర్పంచ్ జిల్లెల్ల జనార్ధన్‌రెడ్డి వంకాయల నారాయణరెడ్డి ఏకుల వెంకటయ్య ప్రభయ్య లింగం ఏకుల అంజయ్య కొమ్ము వెంకటయ్య ఏకుల సంపత్ బిజెపి నేతులు మోహన్ సింగ్ చేగు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జయినింగ్ రిపోర్టు అందజేస్తున్న నూతన టీచర్లు




**తలకొండపల్లి, అక్టోబరు 16 ప్రభాతవార్త** తలకొండపల్లి ఎంఈవో కె జంపాల నాయక్ జయినింగ్ రిపోర్టు అందజేస్తున్న నూతన టీచర్లు బోయని రమేష్ మరియు డబ్బికార్ శ్రీకాంత్‌లున్నారు. ఈ కార్యక్రమలో పాల్గొన్న జడ్పిహెచ్ఎస్ పడకల్ కాంప్లెక్స్ జీహెచ్ఎం రామనాథం తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేశ మరియు పాల్గొన్నారు.

## టీచర్ ఉద్యోగం సాధించిన రాఘవేందర్‌కు సన్మానం



**తలకొండపల్లి, తలకొండపల్లి, అక్టోబరు 16 ప్రభాతవార్త** రంగారెడ్డిజిల్లా తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో సిపిఎం పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యం లో సిపిఎం పార్టీ సభ్యులు బట్టు పర్వతాలు యాదమ్మ కుమారుడు బట్టు రాఘవేందర్ ప్రభుత్వ టీచర్ ఉద్యోగానికి రాఘవేందర్ టీచర్‌గా సెలక్షన్ అయినాడు కష్టపడి చదువుకుని గ్రామంలో ప్రాథమిక విద్య చదివి మహబూబ్‌నగర్‌లో బ్రెయిన్ లిపి ద్వారా విద్యను కొనసాగించి ఈ రోజు టీచర్ ఉద్యోగం సాధించడం గొప్ప విజయమని ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ నాయకులు దుబ్బ చెన్న య్య సిఐటియు ఆమనగల్ ఏరియా కన్ వ్వనర్ పెంటయ్య సిపిఎంపార్టీ పడ కల్ గ్రామ కార్యదర్శి శివగళ్ల రమేష్ పార్టీ సభ్యులు జంగయ్య పాల్గొన్నారు.

## జంగయ్యను వరించిన జాతీయ పురస్కారం



**కేశంపేట అక్టోబరు, 16 ప్రభాతవార్త** గుడివారు రోజు ఎదుర్కొంటున్న సమస్యలపై బొమ్మల ద్వారా చేసిన సేవకు కేశంపేట మండల కేంద్రానికి చెందిన పోలె పోగు జంగయ్యకు జాతీయ పురస్కారం దక్కింది. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ విష్ణుదేవ్ వర్మ చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. గత కొన్ని సంవత్సరాల నుండి గుడ్డి వాళ్ల జీవన శైలిపై బొమ్మల ద్వారా అవగాహన కల్పిస్తూ వస్తున్నారు. బొమ్మలద్వారా వారి జీవనశైలిలో మార్పుకోసం చేస్తున్న సేవపై జాతీయ వైట్‌కెన్ సేఫ్టీ రోజు సందర్భంగా తెలంగాణ నేషనల్ ఆర్టిస్టు అవార్డును వికలాంగుల విభాగంలో అదుకున్నారు.

## నిందితుడి అరెస్టు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 16) :** దసరా పండగ సందర్భంగా పక్కింటి వారు గ్రామానికి వెళ్లడాన్ని గ్రహించి ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని బుధవారం షాద్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఫరూఖ్‌నగర్ మండలంలోని కడియాలకుంట తండా గ్రామపంచాయతీ పరిధిలో గల బూర్జుగడ్డ తండాకు చెందిన నేనావత్ లచ్చిరామ్ దసరా పండగ నేపథ్యంలో ఇంటికి తాళం వేసి వేరే ప్రాంతానికి వెళ్లాడు. ఇది గమనించిన అదే గ్రామానికి చెందిన మూడావత్ మణిరాం ఇంట్లోకి చొరబడి బీరువలో ఉన్న 50 తులాల వెండి కడియాలు, నగదును దొంగిలించాడు. ఇంటికి తిరిగివచ్చిన లచ్చిరామ్ దొంగతనం జరిగిన విషయం గ్రహించి ఈనెల 14న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపిన పోలీసులు మణిరాంను అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా నేరం ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద నుంచి 50 తులాల వెండి కడియాలు, 9800 నగదును పోలీసులు స్వాధీనం చేసుకొని బుధవారం కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

### ఎంబీబీఎస్ సీటు సాధించిన మేఘనకు అభినందనల వెల్లువ

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 16) :** ఎంబీబీఎస్‌లో ఉచిత సీటు సాధించిన భైరమోని మేఘనను ముదిరాజ్ సంఘం నేతలు బుధవారం అభినందించారు. ముదిరాజ్ సంఘం తాలుకా అధ్యక్షులు మంగ వెంకటేష్, అందె పైలయ్య, షాద్‌నగర్ పట్టణ అధ్యక్షులు శ్రీధర్ వర్మ, అందె జంగ రాజు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య తదితరులు మేఘ నను అభినందించారు. టిఫిన్ నడిపించుకునే భైరమోని రమేష్, మంజుల దంపతుల కుమార్తె భైరమోని మేఘన ఎంబీబీఎస్‌లో ఫ్రీ సీటు సాధించడం గొప్ప విషయమని వారు అభినందించారు. అనంతరం మేఘనకు స్వీట్లు తినిపించి, శాలువాతో సన్మానించారు.

### శ్రేయ ఆరోగ్య బీమా

నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో శ్రేయ మ్యూజిక్ ఎంట ర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో రూపొందించిన రెండు భక్తి గీతాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మైయాకా గుంగాన్ కరో తేరేదార్ కాపూజారి జగదాంబే భక్తి గీతాలతో పాటు వినూత్నంగా ఉద్యోగులు వినియోగదారుల కోసం శ్రేయహెల్త్ ఇన్సూరెన్స్ ప్రోగ్రామ్ పేరుతో ప్రత్యేక ఆరోగ్య బీమా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామని సంస్థ క్రియేటివ్ హెడ్ హేమంత్‌కుమార్ రాయ్ తెలిపారు.

### జై భీం ఎడ్యుకేటెడ్ యూత్ నూతన కార్యవర్గం ఎన్నిక

**యాచారం అక్టోబరు16, ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో జై భీమ్ యూత్ అసోసియేషన్ నూతన కార్య వరాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మరాటి వివేక్, సమన్వయకర్తగా గుండె రాఘవేందర్, ప్రధాన కార్యదర్శిగా భూపతి గౌతమ్, ఉపాధ్యక్షుడు తెలగమల్ల పృథ్వీ సహాయ కార్యదర్శి పెరుమాళ్ల శ్రీకాంత్, మధుకర్, కోశాధికారి మరాటి అరుణ్ కుమార్, సాంస్కృతిక కార్యదర్శి పంబాల శివాజీ తెలగమల్ల కార్తీక్ గుండె మధు, ప్రచార కార్యదర్శి తెలగమల్ల ప్రశాంత్, భూపతి నందు, భూపతి శ్రీశైలం, ఆటల కార్యదర్శి భూపతి జీవన్ కుమార్, మరాటి నవీన్ కుమార్, పంబాల శివలింగం, పెరుమాళ్ల వంశీలను ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షుడు వివేక్ మాట్లాడుతూ....నూతన కార్యవర్గం పెద్దల సలహాలు సూచనలతో అంబేద్కర్ ఆశయాల సాధన బాటలో నడుస్తూ యూత్‌కి మంచి పేరు తీసుకొచ్చే విధంగా ప్రయత్నం చేస్తుందని, యువజన సంఘాలు గ్రామా ల అభివృద్ధికి ప్రజా సమస్యల పట్ల చైతన్యం చేయుటలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. మెంటార్ గుండె రాఘవేందర్ మాట్లాడుతూ...యూత్‌కి మంచిపేరు తీసుకొచ్చే విధంగా కార్యవర్గం ప్రణాళికలు రూపొందించాలని సభ్యులకి శుభాకాంక్షలు తెలిపారు,.

### గాలికుంటు వ్యాధి టీకాను తప్పనిసరిగా వేయించుకోండి

**యాచారం అక్టోబరు16, ప్రభాతవార్త :** పశువులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలను వేయించుకోవాలని యాచారం మండల పశుసంవర్ధక శాఖ వైద్య అధికారిని డా. రేఖ పేర్కొన్నారు. గురువారం యాచారం మండల పరిధిలోని మాల్, మొగుళ్ల పంపు గ్రామాలలో పాడిపశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను అందజేశారు. మండలంలోని వారం రోజులు నిర్వహించే కార్యక్రమంలో రైతులు వారి వారి గ్రామాలలో వైద్య బృందం వచ్చినప్పుడు వారికి సహకరించి పశువులకు టీకాలు వేయించుకోవాలని తెలిపారు. సుమారు 480 పశువులకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. పాడి రైతులు లక్షల రూపాయలు ఖర్చు చేసి ఆవులను గేదెలను కొనుగోలు చేసి గాలికుంటు వ్యాధి టీకాలు వేయించడంలో నిర్లక్ష్యం వహిస్తే నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. ఈ అవకాశాన్ని పాడి రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

### మాల్‌లో అంబేద్కర్ విగ్రహానికి మసిపుసిన దుండగులు

**యాచారం అక్టోబరు16, ప్రభాతవార్త :** రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి గుర్తు తెలియని వ్యక్తులు మసిపూసిన సంఘటన యాచారం పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఇబ్రహీంపట్నం ఎసిపి కెవిపి రాజు, యాచారం సీఐ శంకర్ కుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం....యాచారం మండలం మాల్ గ్రామపంచాయతీ పరిధిలో నల్లగొండ చౌరస్తా వద్ద ఉన్నటువంటి అంబేద్కర్ విగ్రహ ముఖ భాగంలో గుర్తుతెలియని వ్యక్తులు గుర్తు తెలియని పదార్థంతో మసి రుద్దినట్లు పేర్కొన్నారు. గ్రామస్తులు అంబేద్కర్ వాదులు బహుజనులందరూ సంఘటన స్థలానికి చేరుకొని తక్షణమే దుండగలను గుర్తించి వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకొని అంబేద్కర్ ఆశయాలు గుర్తించాలని ఏసిపి కెవిపి రాజు, సిఐ శంకర్ కుమార్‌లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎసిపి మాట్లాడుతూ...ఈ చర్యకు ప్పాలడిన వ్యక్తులు ఎంతటి వారైనా సరే ఏ పార్టీకి సంబంధించిన వారైనా సరే వారిపైన కఠినమైన చర్యలు తప్పవని చెప్పారు. ఈ కార్యక్రమంలో యాచారం మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్, యాచారం మండలం ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిన్నోళ్ల మల్లేష్, యాచారం మండల ఎమ్మార్పిఎస్ అధ్యక్షుడు మహేష్, ఎన్‌హెచ్‌పిసి అధ్యక్షుడు దేరంగుల ఈశ్వర్, మల్లోజు శ్రీనివాస చారి, మంద లింగం, కంబాలపల్లి సాయిలు, ఏఐుక శేఖర్, ఎండి సలీం, నాయకులు గ్రామ ప్రజలు, భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

### ఏకగ్రీవంగా కాంగ్రెస్ గ్రామకమిటీ ఎన్నిక

**ధారూర్, అక్టోబరు 16, ప్రభాతవార్త** మండలపరిదిలోని ధారూర్ స్టేషన్ గ్రామంలో కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుల ఆద్వర్యంలో గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షులుగా ఎల్ వెంకటేశం ఉపాధ్యక్షులుగా బాల్‌నాయక్ ఎన్నికయ్యారు. గ్రామ జనరల్ సెక్రెటరీ శుభాన్ ఎస్టీసెల్ అధ్యక్షులుగా నెహ్రూ నాయక్ బిసి సెల్ అధ్యక్షుడిగా బాల్‌రాజ్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షబ్బీర్ గ్రామ యూత్ అధ్యక్షుడిగా పవన్‌కుమార్ రైతు సంఘం అధ్యక్షుడిగా అంజయ్యను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతయ్య యాదయ్య విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### ఘట్‌కేసర్‌లో ఘనంగా దుర్గామాత ఊరేగింపు

**ఘట్‌కేసర్, అక్టోబర్ 16, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ పట్టణంలో దుర్గామాత ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. దసరా సందర్భంగా గురుకుల్ మైదానంలో శ్రీభవాని నవరాత్రి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్టించి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా జరిపారు. అమ్మవారిని 9 రోజుల పాటు వివిధ రూపాలలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి దుర్గామాత శోభాయాత్రను ఘనంగా నిర్వహించి బాలాజీనగర్ చిన్నచెరువులో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. నిర్వహకులు కొమ్మిడి శివప్రదీప్‌రెడ్డి, కొమ్మిడి విక్రాంత్‌రెడ్డిలు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి శోభాయాత్రను ప్రారంభించారు. బ్యాండ్‌మేళాలు, కళాకారులు, యువకుల నృత్యాలు, టాపాసుల శబ్దాల మధ్య అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, గడ్డిఅన్నారం ఎఎంసీ డైరెక్టర్ చిల్కూరి మచ్చేంధర్‌రెడ్డి, మాజీ వార్డుసభ్యులు నోముల నవీన్‌ప్రకాష్, మున్సిపల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు బక్క పసత్తిరెడ్డి, శ్రీభవాని నవరాత్రి ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

## బెల్టు షాపుల్లో మద్యం అమ్మకాలు నిలిపివేయండి

### గంట్లవెళ్లి గ్రామస్థుల తీర్మాణం

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 16) :** తమ గ్రామంలో బెల్టు షాపుల్లో మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని, వాటిని పూర్తిగా నిలిపివేయాలని ఫరూఖ్‌నగర్ మండలం గంట్లవెళ్లి గ్రామస్థులు తీర్మాణం చేశారు. బుధవారం గ్రామ పంచాయతీలో సమావేశమైన గ్రామస్థులు మద్యం కారణంగా గ్రామంలో గొడవలు పెరిగిపోయాయని, యువత పెడదారి పడుతున్నారని, గ్రామంలో మద్యం అమ్మకాలు నిలిపివేయాలని కార్యదర్శి దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు గ్రామస్థులు పంచాయతీ కార్యాలయంలో మూకుమ్మడి తీర్మాణం చేశారు. ఈ విషయమై షాద్‌నగర్ ఎక్సైజ్ సీఐకి పంచాయతీ కార్యదర్శి లేఖ రాసి గ్రామంలో మద్యం అమ్మకాలు పూర్తిగా అరికట్టాలని కోరారు.

## ఘనంగా శ్రీరేణుకా ఎల్లమ్మ బోనాల పండుగ




శామీర్‌పేట, అక్టోబరు 16, ప్రభాతవార్త

శామీర్‌పేటలో శ్రీరేణుకా ఎల్లమ్మ అమ్మవారి బోనాల పండుగ కన్నుల పండుగగా ఘనంగ జరిగింది. బుధవారం శామీర్‌పేటలో శ్రీరేణుకా ఎల్లమ్మ అమ్మవారి బోనాల పండుగ గౌడ సంఘం వారి ఆధ్వర్యంలో ఘనంగ జరిగింది. శామీర్‌పేటలో ఉన్న శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం 7వ వార్షికోత్సవం సందర్భంగ మూడు రోజుల పాటు వార్షికోత్సవ పూజా కార్యక్రమాలు జరిగాయి. సోమవారం గ్రామ దేవతలకు ఒడి బియ్యం, బోనాల సమర్పించే కార్యక్రమం, మంగళవారం శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో కల్యాణోత్సవం ఘనంగ జరిగింది. బుధవారం శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో వార్షికోత్సవం సందర్భంగ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం గౌడ సంఘం సభ్యులు అమ్మవారికి బోనాలు చేసి మహిళలు ఊరేగింపుగా గ్రామం నుంచి శ్రీరేణుకా ఎల్లమ్మ అమ్మవారి ఆలయం వరకు బోనాలతో మహిళలు ఊరేగింపుగా వెళ్లటం జరిగింది. డోలువాయిద్యాలతో, శివసత్తుల పూనకాలతో, జోగినిల ఆటపాటలతో బోనాల ఊరేగింపు కార్యక్రమం కన్నుల పండుగగా కొనసాగింది. బుధవారం రాత్రికి శ్రీరేణుకా ఎల్లమ్మ అమ్మవారి బోనాల పండుగ సందర్భంగ ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమం ఘనంగ జరిగింది. శామీర్‌పేట గ్రామం నుంచి శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వరకు గౌడ సంఘం వారి ఆధ్వర్యంలో ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమం జరిగింది. బోనాల ఊరేగింపుతో పాటు ఆ తరువాత జరిగిన ఈ ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలోనూ భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### సబ్‌కలెక్టర్‌కు తండావాసుల వినతి

**బొంరాస్‌పేట్, అక్టోబరు 16, ప్రభాతవార్త :** బొంరాస్‌పేట్ మండలం మేడిచెట్టు తాండ గ్రామపంచాయతీ పరిధిలోని పాఠశాల స్థలం వివాదంపై వికారాబాద్ జిల్లా సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌కు తండావాసులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడిచెట్టుతండాలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన స్థలంను గతంలో తండావాసులు అందరు కలిసి భూమిని కొనుగోలు చేయడం జరిగిందని దానికి సంబంధించిన కాగితాలు కూడా తమ దగ్గర ఉన్నాయని తెలిపారు. కాగితాలు ఉన్న కూడా గతంలో ఇచ్చినవారు ప్రస్తుతం అక్కడ ఇల్లు కట్టడానికి సిద్ధకావడంతో అక్కడ ఇల్లు కట్టవద్దని తండావాసులు, అధికారులు చెప్పిన కూడా వినడంలేదన్నారు. ఈ విషయంపై సబ్‌కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా సమస్యను రాసిఇవ్వడం జరిగిందని వివాదాన్ని త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని తండావాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తండావాసులు, యువకులు పాల్గొన్నారు.

### సుల్తాన్‌పూర్‌లో దొంగల బీభత్సం.. ఐదు ఇళ్లలో చోరీ

**పరిగి అక్టోబరు16, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా పరిగి మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో ఒకేసారి ఐదు ఇళ్లలో దొంగతనం జరిగింది. తాళం వేసిన ఇండ్లలో దొంగలు తాళాలు విరగ్గొట్టి బంగారు, వెండి ఆభరణాలు, నగదును దొంగలించారు. పరిగి ఎస్ఐ సంతోష్, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం...ఐదు ఇళ్లలో కలిపి 12 తులాల బంగారు ఆభరణాలు, 46 తులాల వెండి ఆభరణాలు, 50 వేల రూపాయలు నగదును దొంగలు అపహరించున్నట్టు తెలిపారు. సూల్తాన్‌పూర్‌లోని శ్రీనివాస్ ఇంట్లో ఐదు తులాల బంగారం, 23 తులాల వెండి, కొత్తూరు శ్రీనివాస్ ఇండ్లో 9 గ్రాముల బంగారం, 20 తులాల వెండి, కొల్లూరి భారతమ్మ ఇంట్లో ఆరు తులాల బంగారం, మూడు తులాల వెండి, నర్సింలు ఇంట్లో 50 వేల నగదు తొమ్మిది గ్రాముల బంగారాన్ని దొంగలు దోచుకెళ్లారు. గుడ్ల వెంకటయ్య ఇంట్లో ఏ వస్తువులు లభించలేదు. బాధితుల పరిగి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ సంతోష్ కుమార్, తన సిబ్బందితో సంఘటన జరిగిన ప్రదేశాలను పరిశీలించి, క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించారు. దొంగలను పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.

### జిల్లా సొసైటీ డైరెక్టర్‌గా మెరుగైన సేవలు అందించాలి

**చౌడపూర్ అక్టోబరు14, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల సొసైటి చైర్మన్ మొగులయ్య ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసి డైరెక్టర్‌గా ఎన్నికైన సందర్భంగా తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపాల్ వెంకట్ సొసైటీ చైర్మన్ మొగులయ్యను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వెంకట్ మాట్లాడుతూ....సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య మండల ప్రజలకు, రైతులకు జిల్లా డైరెక్టర్‌గా మెరుగైన సేవలు అందించాలని కోరారు. మొగులయ్య మాట్లాడుతూ...తన సేవలను గుర్తించి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డైరెక్టర్‌గా స్థానం కల్పించడమే కాకుండా తనకు మరింత బాధ్యత పెరిగిందని జిల్లాలో కులకచర్ల మండల సొసైటీని ప్రథమ స్థానంలో ఉండేలా తన సేవలను అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాగాని ఆంజనేయులు, కామునిపల్లి వెంకట్, చిన్న వెంకట రాములు, మొగులయ్య, తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే టిఆర్ఆర్ సహకారంతో బీటి రోడ్డు మంజూరు

**చౌడపూర్ అక్టోబరు16, ప్రభాతవార్త :** పరిగి నియోజకవర్గ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సహకారంతోనే చాకలిపల్లి నుండి ఫతేపూర్ గ్రామం వరకు బిటి రోడ్డు మంజూరు అయిందని చాకలిపల్లి గ్రామ ప్రజలు, నాయకులు ఎమ్మె ల్యేకు కృతజ్ఞతలు తెలుపుతూ స్వీట్లు పంచుకున్నారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే టిఆర్ఆర్ ఇచ్చిన హామీని అమలు చేయడం ఆనందంగా ఉందని గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు చంద్రశేఖర్ తెలిపారు.

### అర్హులైన యువతి, యువకులు ఓటు నమోదు చేసుకోవాలి

**కొడంగల్, అక్టోబరు 16ప్రభాతవార్త** అర్హులైన యువతి, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహశీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అఖిలపక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఓటరు జాబితాలో మీ పేరు ఉందా..లేకుంటే వెంటనే ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఓటు నమోదు, ఓటరు జాబితా సవరణకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందన్నారు. త్వరలో జరిగే గ్రామపంచాయతీ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు రమేష్‌బాబు, సంతోష్, బస్వరాజ్, అంజద్, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

## చేపలు పట్టడానికి వెళ్లి వ్యక్తి మృతి

**షాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త :** చేపలు పట్టడానికి వెళ్లి మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.... మండల పరిధిలోని కేశగూడ గ్రామానికి చెందిన తోటమీది యాదయ్య(35) ఇంట్లో షాబాద్ పహిల్వాన్ చెరువులో చేపలు పట్టడానికి వెళ్తున్నానని చెప్పి గాళం తీసుకుని ఇంట్లో నుండి బయటకు వెళ్లాడు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. బుధవారం ఉదయం అదే గ్రామానికి చెందిన భవాని బువ్వయ్య తల నీటిలో తేలడంతో బయటకు తీసి చూశాడు. మా గ్రామానికి చెందిన యాదయ్య గుర్తించాడు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు వెళ్లి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేద్దాం

### మాల మహానాడు రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మహేష్ మాల

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 16) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలలను అణిచివేయాలని చూస్తున్నారని, మనువాద పార్టీలు మాలలకు అన్యాయం చేస్తున్నాయని, మాలల సత్తా మనువాద పార్టీలకు చూపిస్తామని మాల మహానాడు రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మహేష్ మాల పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఇన్‌స్పెక్షన్ బంగ్లాలో హలో మాల ఛలో నాగర్‌కర్నూల్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. నాగర్‌కర్నూల్‌లో జరిగే బహిరంగ సభకు షాద్‌నగర్ నియోజకవర్గం నుండి మాలలు భారీ సంఖ్యలో తరలిరావాలని, మాల మహానాడు నాయకులు, వివిధ పార్టీలకు చెందిన మాల నాయకులు, గ్రామ, మండల నాయకులు, విద్యార్థులు, మేధావులు, కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు అర్జున్ కుమార్, రామచందర్, మహేందర్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మహేష్, జగన్, షాద్‌నగర్ నియోజకవర్గం అధ్యక్షులు వినోద్, ఉపాధ్యక్షులు సుంకం నర్సింలు, మాల మహానాడు టౌన్ అధ్యక్షులు శ్రీను, ఫరూఖ్‌నగర్ మండలాధ్యక్షులు శేఖర్, కొందుర్గు మండలాధ్యక్షులు అశోక్, కేశంపేట మండలాధ్యక్షులు కుమార్, షణ్ముఖ్, శ్రీను, కుమార్, నరేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


IN THE COURT OF THE HON'BLE
IX ADDL DISTRICT JUDGE
R.R.DISTRICT, AT: L.B.NAGAR
I.A.No. 662 OF 2023
IN
O.S.No. 843 OF 2022

Between:
**P. ARUNDHATHI** ...PETITIONER/PLAINTIFF
AND
**E. KAMALAMMA & OTHERS** ...RESPONDENTS/DEFENDANTS

To
**23. SRI. EMMADI PRASHANTH REDDY, S/o. E. MADHUSUDHAN REDDY,** Aged about: 27 yrs, Occ: Farmer, R/o. H.No.2-26, Bakaram Jagir Village, Moinabad Mandal, Ranga Reddy District-501 504.
**24. SMT. EMMADI KARUNA SRI, W/o. E. MADHUSUDAN REDDY,** Aged about: 48 yrs, Occ: House wife, R/o. H.No.2-26, Bakaram Jagir Village, Moinabad Mandal, Ranga Reddy District-501 504.

Please take notice that the above named plaintiff filed the suit for partition and separate possession against respondents/defendants in respect of the Agricultural land bearing Sy.No.24, admeasuring Ac.3-03 gts, and in Sy.No.25, admeasuring Ac.0-22 Gts, in Sy.No.26, admeasuring Ac.8-35 Gts, in Sy.No.53, admeasuring Ac.1-16 Gts, in Sy.No.55, admeasuring Ac.0-39 gts, in Sy.No.56, admeasuring Ac.0-38 Gts, in Sy.No.65, admeasuring Ac.1-31 Gts, in Sy.No.78, admeasuring Ac.7-00 Gts, in Sy.No.149, admeasuring Ac.2-02Gts, in Sy.No.150, admeasuring Ac.3-23 Gts, in Sy.No.151, admeasuring Ac.6-00 and also in Sy.No.153, admeasuring Ac.1-09 Gts, Total admeasuring Ac.37-18 Gts, Situated at Bakaram Jagir Village, Moinabad Mandal, Ranga Reddy District., and the above suit stands posted to **23-10-2024.** It is submitted that, you are made party the above case as respondent/defendants No. 23 & 24, if you have any right or title whatsoever hereby requested to appear in person or by pleader before this Hon'ble Court on **23-10-2024 at 10:30 A.M.** Otherwise the matter will be called and decided ex-parte in your absence.

//BY ORDER OF THE HON'BLE COURT//
**Sd/- M/s. G. CHANDRA SHEKAR**
**Advocate**
# Beside Bank of India, Hyderabad Road, Chevella, District Ranga Reddy-501503, T.S.
**Cell: 9849751314, 9849689075**
**E-mail: guttala.chandrashekar@gmail.com**



IN THE COURT OF THE HON'BLE
IX ADDL DISTRICT JUDGE
R.R.DISTRICT, AT: L.B.NAGAR
O.S.No. 843 OF 2022

Between:
**P. ARUNDHATHI** ...PETITIONER/PLAINTIFF
AND
**E. KAMALAMMA & OTHERS** ...RESPONDENTS/DEFENDANTS

To
**19. Maheshwar Reddy Pesara, S/o. Late. P.M. Reddy,** Aged about: 64 yrs, Occ: Employee, R/o. H.No.2-19-104/7, East Kalyanpuri, Uppal, Hyderabad-500039.

Please take notice that the above named plaintiff filed the suit for partition and separate possession against respondents/defendants in respect of the Agricultural land bearing Sy.No.24, admeasuring Ac.3-03 gts, and in Sy.No.25, admeasuring Ac.0-22 Gts, in Sy.No.26, admeasuring Ac.8-35 Gts, in Sy.No.53, admeasuring Ac.1-16 Gts, in Sy.No.55, admeasuring Ac.0-39 gts, in Sy.No.56, admeasuring Ac.0-38 Gts, in Sy.No.65, admeasuring Ac.1-31 Gts, in Sy.No.78, admeasuring Ac.7-00 Gts, in Sy.No.149, admeasuring Ac.2-02Gts, in Sy.No.150, admeasuring Ac.3-23 Gts, in Sy.No.151, admeasuring Ac.6-00 and also in Sy.No.153, admeasuring Ac.1-09 Gts, Total admeasuring Ac.37-18 Gts, Situated at Bakaram Jagir Village, Moinabad Mandal, Ranga Reddy District., and the above suit stands posted to **23-10-2024.** It is submitted that, you are made party the above case as respondent/defendants No. 19, if you have any right or title whatsoever hereby requested to appear in person or by pleader before this Hon'ble Court on **23-10-2024 at 10:30 A.M.** Otherwise the matter will be called and decided ex-parte in your absence.

//BY ORDER OF THE HON'BLE COURT//
**Sd/- M/s. G. CHANDRA SHEKAR**
**Advocate**
# Beside Bank of India, Hyderabad Road, Chevella, District Ranga Reddy-501503, T.S.
**Cell: 9849751314, 9849689075**
**E-mail: guttala.chandrashekar@gmail.com**

## క్షతగాత్రుడికి 108 సిబ్బంది చికిత్స

**చౌటకూరు, అక్టోబరు 16, ప్రభాతవార్త:** మండల పరిధిలోని శివంపేట గ్రామ శివారులో బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ప్రమాదానికి గురైన వ్యక్తికి 108 సిబ్బంది ప్రథమచికిత్స చేశారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం, జోగిపేటకు చెందిన శివకుమార్ కొరియర్ బాయ్‌గా పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడని, పనిలో భాగంగా ద్విచక్ర వాహనంపై విధులకు వెళుతున్న క్రమంలో శివంపేట గ్రామశివారులోని డిస్లహరి పరిశ్రమ ఎదురుగా స్కూటీ, బైక్ ఢీకొనడంతో శివకుమార్ ప్రమాదానికి గురయ్యాడని తెలిపారు. విషయం తెలుసుకున్న వెంటనే 108 సంఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రుడికి ప్రథమచికిత్స అందించి, సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఈఎంటి మల్లేష్, పైలట్ మురాత్‌లు తెలిపారు.

## ఏకపక్ష ఇందిరమ్మ గ్రామ కమిటీలు

**జహీరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** ఇందిరమ్మ గ్రామ కమిటీలను ఏకపక్షంగా ఏర్పాటుచేశారని, ఈ కమిటీలను వెంటనే రద్దుచేయాలని బిఆర్‌ఎస్ మండల అధ్యక్షులు తట్టు నారాయణ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ మహేందర్‌రెడ్డికి బిఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి తట్టు నారాయణ వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా తట్టు నారాయణ మాట్లాడుతూ, ఇందిరమ్మ గ్రామ కమిటీలను ప్రజలను సంప్రతించకుండా తమ ఇష్టారీతిన ఏర్పాటు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏకపక్షంగా నియమించిన కమిటీలపై ఎంపిడిఓ ఏకపక్ష ధోరణి సరికాదని విమర్శించారు. ఇలా ఏర్పాటు చేసిన కమిటీలను రద్దు చేయాలన్నారు. కమిటీలను ప్రజల సమక్షంలో నియమించాలని సూచించారు. కార్యక్రమంలో ఇప్పేపల్లి సొసైటీ చైర్మన్ మచెందర్, మాజీ ఎంపిటిసి బస్వరాజ్, రాములు, ప్రేమ్ బానోత్, మాజీ సర్పంచ్‌లు చిన్న పటేల్, జగదీశ్వర్, విజయ్, మండల అనుబంధ సంఘాల అధ్యక్షులు, ఎస్టీ సెల్ హారు రాథోడ్, బిసి సెల్ అమిత్‌కుమార్, గ్రామ పార్టీ అధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, మోహన్ గులాబ్ సింగ్, భీమ్‌రావు, నాయకులు పర్వేజ్, అనిల్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, శివ ముదిరాజ్, మహేందర్, దత్తురెడ్డి శంకర్, కిష్టరెడ్డి, మారుతి, ముబీన్, ప్రశాంత్‌రెడ్డి, రాజ్‌కుమార్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## 11మంది కొత్త ఉపాధ్యాయులు

**పాపన్నపేట, అక్టోబరు 16, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా పాఠశాలల్లో విధులు నిర్వహించేందుకు 11 మంది ఉపాధ్యాయులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మండల కేంద్రమైన పాపన్నపేటలోని ఎంఆర్‌సి కార్యాలయంలో కొత్తగా ఉపాధ్యాయులుగా చేరుతున్న ఉపాధ్యాయులు ఎంఈఓ ప్రతాప్‌రెడ్డితో మర్యాద పూర్వకంగా కలుసుకుని జాయినింగ్ రిపోర్టు చేశారు. మల్లంపేట ఉన్నత పాఠశాలకు 3 స్కూల్ అసిస్టెంట్లు, అన్నారం పాఠశాలకు ఒక స్కూల్ అసిస్టెంట్, ఆర్కెల ప్రాథమికోన్నత పాఠశాలకు లాంగ్వేజ్ పండిత్, పాపన్నపేట ఉర్దూ మీడియం, సోమ్లా తండా, అమ్రియా తండా, కొత్త లింగాయపల్లి, మొదల్లకుంట, పొడిచన్‌పల్లి, పాఠశాలలకు ఎస్జీటి ఉపాధ్యాయులుగా విధులు చేపట్టనున్నారు.

## కొత్త ఉపాధ్యాయులకు నియామకపత్రాలు



అల్లాదుర్గంలో ఎంఈఓ నుంచి నియామకం పత్రాలు అందుకుంటున్న ఉపాధ్యాయులు

**అల్లాదుర్గం, అక్టోబరు 16, ప్రభాతవార్త:** మండలానికి కేటాయించిన 21 మంది కొత్త ఉపాధ్యాయులు బుధవారం మండల కేంద్రమైన అల్లాదుర్గంలోని ఎంఆర్‌సి కార్యాలయంలో ఎంఈఓ ధనుంజయ నియామకప్రతాలు అందచేసి పాఠశాలలను కేటాయించారు. మండలానికి 19మంది ఎస్‌జిటిలు, ఇద్దరు ఎల్‌పి ఉపాధ్యాయులు వచ్చారని ఎంఈఓ ధనుంజయ పేర్కొన్నారు. మండలం నుంచి 8 మంది ఉపాధ్యాయులు ఇతర మండలాలకు బదిలీ అయినట్లు ఎంఈఓ వివరించారు.

## అనాధబాలికల విద్యకు ఆర్థికసహాయం

**సంగారెడ్డి టౌన్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** కరోనా బారినపడి తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ బాలికల విద్య కొరకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఆర్థికసహాయం అందచేశాయి. మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విజయచిత్ర ఫౌండేషన్ సహకారంతో అనాథలుగా మారిన 15 మంది ఆడపిల్లలు విద్యను కొనసాగించేందుకు 3లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందచేశారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని మెడ్వాన్ కార్యాలయంలో పిల్లల సంరక్షకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడ్వాన్ డైరెక్టర్ హెచ్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాలుగా అనాధ బాలికలు విద్యను అందుకునేందుకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు గుర్తుచేశారు. అనాథ బాలికలు క్రమశిక్షణతో విద్యను అందుకుని ఉన్నతశిఖరాలకు చేరుకుని మీరుసైతం పేదలకు సహాయం చేయాలని సూచించారు. సిడబ్లూసి సభ్యులు జి.వెంకటేశం మాట్లాడుతూ, ఆడపిల్లల చదువుకు ప్రోత్సహించటం అభినందనీయమని కొనియాడారు. 15 మంది బాలికలకు మెడ్వాన్ డైరెక్టర్, సిడ్లూసి సభ్యులు చెక్కులను అందచేశారు. కార్యక్రమంలో పిల్లల సంరక్షులు, మెడ్వాన్ కో-ఆర్డినేటర్ ఎంఏ ముజీబ్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## చౌటకూరులో పశువైద్య శిబిరం

**చౌటకూరు, అక్టోబరు 16, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరులో బుధ వారం పశువైద్య శిబిరం ఏర్పాటుచేశారు. శిబిరంలో పశువులకు గాలికుంట నివా రణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విశాల్ మాట్లాడుతూ, మండలంలోని ప్రతి గ్రామంలో శిబిరాలు నిర్వహిస్తామని, పశువులకు గాలికుంట వ్యాధి సోక కుండా ముందస్తుగా టీకాలు వేస్తున్నామని, అందుకు రైతులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చౌటకూరులో 150 పశువులకు టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

## గడిపెద్దాపూర్‌లో పోలేరమ్మ ప్రతిష్ఠ

**అల్లాదుర్గం, అక్టోబరు 16, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గడిపెద్దాపూర్ గ్రామంలో శ్రీ పోలేరమ్మ విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు నేత్రపర్వంగా బుధవారం కొనసాగాయి. సోమవారం ప్రారంభమైన ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు బుధవారంతో విశ్వకర్మ బ్రాహ్మణుల ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణులు వేదమంత్రాలు వల్లిస్తుండగా భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిసాయి. గ్రామంలో మూడురోజులపాటు కొనసాగిన పూజలతో గ్రామం ఆధ్యాత్మికంగా శోభిల్లింది. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్ర మానికి గ్రామస్థులు, విశ్వకర్మ బ్రాహ్మణులు, పరిసరగ్రామప్రజలు పాల్గొన్నారు.

## నవోదయలో ప్రవేశ ఎంపిక పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ

**వర్గల్, అక్టోబర్ 16 (ప్రభాతవార్త):** జవహర్ నవోదయ విద్యాలయ వర్గల్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ 9, 11 తరగతులలో ఖాళీగా వున్న సీట్లలో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని విద్యాలయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని విద్యార్థిని, విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను 9వ తరగతిలో ప్రవేశానికి ప్రవేశ పరీక్షకు హాజరుకాబోయే అభ్యర్థులు ప్రస్తుత విద్యా సంవత్సరం 2024-25లో 8వ తరగతి చదువుతూ 2010 మే 1వ తేదీ నుండి 2012 జులై 31 తేదీ మధ్య జన్మించి ఉండాలన్నారు. 11వ తరగతిలో ప్రవేశం కోరే విద్యార్థులు ప్రస్తుతం విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుతూ ఉండి 2008 జూన్ 1వ తేదీ నుండి 2010 జులై 31వ తేదీ మధ్యలో జన్మించి ఉండాలన్నారు. అలాగే దరఖాస్తు చేసుకునే వారి తల్లిదండ్రులు ఉమ్మడి మెదక్ జిల్లాలో నివాసం ఉంటున్నవారు అర్హులని తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఏదేని ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలు ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల 30వ తేదీ దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ అన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు 2025 ఫిబ్రవరి 8వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

# గడిపెద్దాపూర్‌లో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు



గడిపెద్దాపూర్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

**అల్లాదుర్గం, అక్టోబరు 16, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గడిపెద్దాపూర్ గ్రామంలో బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇంచార్జి ఎంపిడిఓ కే శంకర్, తహసీల్దార్ డి మల్లయ్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వానాకాలం సీజన్ నుంచి సన్న రకం బియ్యానికి 500 వందల రూపాయల బోనస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులు పండించిన వరి ధాన్యంను కొనుగోలు కేంద్రాలకు తరలించి లబ్ధిపొందాలన్నారు. క్వింటాలు వరికి 2320 రూపాయలు చెల్లించడం జరుగుతుందన్నారు. సన్నరకం ధాన్యానికి 5వందల రూపాయల బోనస్‌తో పాటు 2820 రూపాయలు అందించడం జరుగుతుందన్నారు. మండలంలో మరి కొన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందన్నారు. సన్నం, దొడ్డు రకాలను వేరు వేరుగా కొనుగోలు చేయాలని, సన్నరకం ధాన్యం బస్తాలపై కొనుగోలు కేంద్రానికి సంబంధించిన వివరాలు ముద్రించాలన్నారు. మిల్లింగ్‌కు ఇబ్బందులు తలెత్తకుండా సన్న, దొడ్డు రకం వరి ధాన్యాం బస్తాలను వేరు వేరుగా మిల్లులకు తరలించడం జరుగుతుందన్నారు. రైతులకు అవసరమైన తాడిపత్రిలు అందుబాటులో ఉంచుకోవాలని కేంద్రం బాధ్యులకు సూచించారు. రైతులకు తాగునీరు, టెంట్, రాత్రి వేళలో విద్యుత్ లైటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్యాడ్ క్లీనింగ్ యంత్రాల ద్వారా ధాన్యం శుభ్రపరిచే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో తూకంపు తేమ, ప్యాడీ క్లీనింగ్ యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపిఎం ఎం నాగరాజు, ఏఈఓ నవీన్, పిటిసి సిద్దేశ్వర్, సిసిఏలు, రైతులు ప్రసాద్, వి దుర్గారెడ్డి, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

## అన్నదాతల కష్టం దళారుల పాలుకావద్దు

**పాపన్నపేట, అక్టోబరు 16, ప్రభాతవార్త:** అన్నదాతల కష్టార్జిత దళారుల పాలు కావద్దని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అధికారులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని శానాయపల్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రోహిత్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండిన వరి ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, అవసరమైనన్ని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, రైతులు మధ్య దళారులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టాలకు గురికావద్దని సూచించారు. సన్నాలకు ప్రత్యేక ధర ఉంటుందన్నారు. కాగా, మల్లంపేట మాజీసర్పంచ్ బాపురెడ్డి నూతన గృహ ప్రవేశంలో ఎమ్మెల్యే పాల్గొని బాపురెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి చందన ప్రశాంత్‌రెడ్డి, డిఆర్‌డిఏ పీడి శ్రీనివాస్‌రావు, డిపిఎం మోహన్, సివిల్ సప్లయ్ డీఎం హరికృష్ణ, డిఎస్‌ఓ సురేష్‌రెడ్డి, వెలుగు ఏపిఎం సాయిలు, కొత్తపల్లి ఎఫ్‌ఎసిఎస్ చైర్మన్ త్యార్ల రమేష్, మాజీ జడ్పీటిసి మల్లప్ప, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోవింద్‌నాయక్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు గౌస్, కాంగ్రెస్ శ్రేణులు, రైతులు పాల్గొన్నారు.

## బీహెచ్‌ఈఎల్‌లో జాతీయస్థాయిలో క్రీడలు

**రామచంద్రాపురం, అక్టోబరు 16, ప్రభాతవార్త:** బీహెచ్‌ఈఎల్ ఇంటర్ యూనిట్ జాతీయస్థాయి క్రీడాపోటీలను బుధవారం బీహెచ్‌ఈఎల్ కమ్యూనిటీ సెంటర్‌లో బీహెచ్‌ఈఎల్ పిఅండ్‌ఎస్‌డి విభాగం ఈడి శ్రీనివాసరావు ప్రారంభించారు. జాతీయస్థాయి బిహెచ్‌ఈఎల్ యూనిట్ల నుంచి భోపాల్, హరిద్వార్, తిరుచి, రాణిపేట్, రామచంద్రాపురం నుంచి జట్లు పాల్గొంటున్నాయన్నాయని శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. క్రీడలు కార్మికులకు మానసిక ఉల్లాసాన్ని పెంపొందింప చేస్తాయన్నారు. కార్యక్రమంలో జీఎం సుబ్రహ్మణ్యం, కమ్యూనిటీ సెంటర్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, క్రీడా కార్యదర్శి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## 21రోజులు శానిటేషన్ డ్రైవ్

**రామచంద్రాపురం, అక్టోబరు 16, ప్రభాతవార్త:** భారతీ నగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజి కాలనీలో 21 రోజుల పాటు నిర్వహించేరిమూవల్ ఆఫ్ లెగసి వేస్ట్-21 శానిటేషన్ కార్యక్రమాన్ని బుధవారం కార్పోరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. సంకల్ప గ్రౌండ్ ప్రాంగణంలో జిహెచ్‌ఎంసి సిబ్బంది ఆబ్కట్ సహకారంతో చెత్తాచెదారాన్ని తీసివేయించారు. కార్పోరేటర్ సింధూ మాట్లాడుతూ, ఎంఐజి కాలనీలో ప్రతి పార్కు చుట్టూ, రోడ్డు పక్కన ఉన్న డెబ్రిస్, చెత్తను శుభ్రం చేయాలని శానిటేషన్ సిబ్బందికి సూచించారు. కాలనీ వాసులు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ఇంటిముందుకు వచ్చే ఆటోలలో వేయాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం తమ అదుపులో ఉంటుందని గుర్తుచేశారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు వెంకట్‌రావు, సుబ్బారావు, నారాయణ గౌడ్, జిహెచ్‌ఎంసి మెడికల్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ వెంకటేష్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## విధులలో కొత్త ఉపాధ్యాయులు

**మర్కుక్, అక్టోబర్ 16 (ప్రభాతవార్త):** డిఎస్సీ-2024 ద్వారా నూతనంగా ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులు మర్కుక్ మండలంలోని వివిధ పాఠశాలలో బుధవారం విధులలో చేరారు. ఈ సందర్భంగా నూతన ఉపాధ్యాయులకు మర్కుక్ మండల పిఆర్‌టియు శాఖ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి తుమ్మ కుమార్‌లు వారికి శుభాకాంక్షలు తెలిపి స్వాగతం పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బి.కవిత స్కూల్ అసిస్టెంట్ బయో సైన్స్ విధుల్లో చేరగా, పాతూరు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా శ్రీకాంత్, నర్సన్నపేట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా ప్రియాంక, యూసుఫ్‌ఖాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయురాలిగా సంధ్యలు విధుల్లో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఉపాధ్యాయులకు ఎంప్లాయ్ ఐడి ఫార్మ్స్, ప్రాన్ అప్లికేషన్స్, ఫిజికల్ ఫిట్నెస్ సర్టిఫికెట్ ఫామ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకట్రాములు, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు షాబుద్దీన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదిరెడ్డి, గణేష్, నాయకులు రమణారావు, మండల మహిళా కార్యదర్శి భూజాత, మండల ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యాయులు స్వామి, ఫౌసియా, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహం పగులగొట్టిన నిందితుని అరెస్ట్

**వర్గల్, అక్టోబర్ 16 (ప్రభాతవార్త):** మద్యం మత్తులో పెద్దమ్మతల్లి దేవతామూర్తుల విగ్రహాలను పగులగొట్టిన నిందితున్ని గౌరారం పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా గజ్వేల్ ఏసిపి పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ వర్గల్ మండలంలోని సింగాయపల్లి గ్రామశివారులో ఉన్న పెద్దమ్మతల్లి దేవాలయంలో ఉన్న దేవతామూర్తుల విగ్రహాలను అదే గ్రామానికిచెందిన కోకోజి వెంకటస్వామి(30) అనే వ్యక్తి మద్యం మత్తులో పగులగొట్టినట్లు తెలిపారు. సిసి కెమెరాల ద్వారా నిందితున్ని గుర్తించి బుధవారం ఉదయం అదుపులోకి తీసుకొని విచారించి కేసు నమోదు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కంగ్టికి కొత్త ఉపాధ్యాయులు

**కంగ్టి, అక్టోబరు 16 ప్రభాతవార్త:** 2024లో నిర్వహించిన డిఎస్సీ ఫలితాల్లో ఎంపికైన ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. 2024 కొత్త డీఎస్సీలో కంగ్టి మండలానికి ప్రాథమికోన్నత పాఠశాలలో 48 మంది నూతన ఉపాధ్యాయులు వీధుల్లో చేరారు. 12మంది స్కూల్ అసిస్టెంట్ విభాగంలో వీధుల్లో చేరారని ఎంఈఓ రహీముద్దిన్ తెలిపారు. నూతన ఉపాధ్యాయులతో మండల వనరులకేంద్రం కిటకిటలాడింది. నూతన ఉపాధ్యాయులకు పీఆర్‌టీయు రాష్ట్ర ఆసోసియేషన్ అధ్యక్షులు కిఫాయత్‌అలీ, ఉపాధ్యాయులు కాశీనాథ్‌జాదవ్, మండల యూటీఎఫ్ మండలాధ్యక్షులు అంజయ్య, ప్రధాన కార్యదర్శి స్వామి తదితరులు ఉన్నారు.

## పల్లెవాగుకు చెక్‌డ్యాం మంజూరు చేయాలి

**చేర్యాల, అక్టోబర్ 16, ప్రభాతవార్త:** చేర్యాల మండలం ఆకునూరు గ్రామశివారు పల్లెవాగుకు చెక్‌డ్యాం మంజూరయ్యేలా చూడాలని బుధవారం జనగామ జిల్లా కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి ఆకునూరు గ్రామప్రజలు వినతిపత్రాన్ని అందించారు. పల్లెవాగు అబ్బోల్ల చింతల వద్ద చెక్‌డ్యాం మంజూరుచేసి, దేవాదుల ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలతో పొల్కమ్మచెరువును నింపాలని కోరారు. అందె అశోక్, ఈరి భూమయ్య, పూర్మ ఆగంరెడ్డి, ఆకుల రాజుగౌడ్, అందె నాని, వెలగల లావణ్య, రఘువీర్, గూడెపు సుదర్శన్, జంబుల వెంకటరెడ్డి, కోయినేని నరసయ్య, రణం శ్రీకాంత్, చెట్టె కొమురయ్య, బండారి సిద్ధయ్య తదితరులు ఉన్నారు.

## విద్యార్థిదశ కీలకం

**ములుగు, అక్టోబర్ 16 (ప్రభాతవార్త):** ఎదుగుతున్న పిల్లలు సోషల్ మీడియాకు ఎంత దూరంగా ఉంటే వారి భవిష్యత్తు అంత బాగుంటుందని, వీరికి విద్యార్థి దశ ఎంతో కీలకమని ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ములుగు మండల పరిధిలోని తునికిబొల్లారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, షీటీమ్ నిర్వహిస్తున్న విధుల గురించి, షీటీమ్ ద్వారా ఎలా రక్షణ పొందవచ్చు అనే అంశాల గురించి, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, యాంటీ హ్యూమెన్, ట్రాఫికింగ్, సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి, అపరిచిత వ్యక్తుల యొక్క ఫోన్ కాల్స్‌పై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ, మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలిపారు. విద్యార్థులు చదువుకునే సమయంలో చెడు అలవాట్లకు బానిస కావొద్దన్నారు. ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టిసారించాలని తెలిపారు. డ్రగ్స్ మరియు ఇతర మత్తుపదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. చదువుకోవడం వల్ల భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సత్యనారాయణ, గజ్వేల్ షీటీమ్ బృందం ఏఎస్‌ఐ శ్రీరాములు, మహిళా కానిస్టేబుల్ శ్యామల, కానిస్టేబుళ్లు రాంచంద్రారెడ్డి, మహేష్, భరోసా సెంటర్ సిబ్బంది హరిత, వినోద, సోనీ, ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్, బిజెపి నాయకులు కాంగ్రెస్‌లో చేరిక

**గజ్వేల్, అక్టోబర్ 16 (ప్రభాతవార్త):** కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్‌ల ఆధ్వర్యంలో బ్రాహ్మణ బంజేరుపల్లి గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్, బిజెపి నాయకులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తూంకుంట నర్సారెడ్డి పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఆకుల శ్రీనివాస్, దూలం రాజు, అల్వాల కనకయ్య, నిమ్మరాజు బాబు, చిన్నబాబు, సత్తయ్య, పోతరాజు బైరయ్య, ఎక్కల ఎల్లం, రవి, కాకల ఎల్లం, స్వామి, సుతారి మైసయ్య, శ్రీహరి తదితరులు ఉన్నారు.

## బిఆర్‌ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి

**జగదేవ్‌పూర్, అక్టోబర్ 16 (ప్రభాతవార్త):** జగదేవ్‌పూర్ మండల పరిధిలోని తీగుల్ గ్రామానికి చెందిన పలువురు బిఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలు పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని అన్నారు. ప్రతి కార్యకర్త కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో బిఆర్‌ఎస్ మాజీ వార్డు సభ్యులు రాములమ్మ శ్రీరాంరెడ్డి, నాయకులు కేశపురం నర్సింహారెడ్డి, బాలకృష్ణారెడ్డిలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మంజుల మహేందర్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉప్పల ప్రవీణ్‌కుమార్, బిసిసెల్ మండల అధ్యక్షుడు లోకేష్, నాయకులు జనార్ధన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మనోజ్, కరుణాకర్, నర్సింలు, బాలకృష్ణ, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను తప్పుదోవ పట్టించడమే కెసిఆర్ కుటుంబ లక్ష్యం

**గజ్వేల్, అక్టోబర్ 16 (ప్రభాతవార్త):** తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించడమే కెసిఆర్ కుటుంబ లక్ష్యమని ఇందుకు రాడార్ కేంద్ర అనుమతి, గురుకుల వసతి గృహాల అద్దెల చెల్లింపు అంశాలు నిదర్శనంగా నిలుస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పిడిచెడ్, వేములఘాట్, పల్లెపహాడ్ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీచేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పేరుతో అప్పులపాలు చేసిన మాజీ మంత్రులు కెటిఆర్, హరీష్‌రావులు కాంగ్రెస్ సర్కార్‌పై విమర్శించటం సిగ్గుచేటన్నారు. రాష్ట్రాన్ని దివాలా తీయించిన ఘనత గత ముఖ్యమంత్రి కెసిఆర్‌కే దక్కుతుండగా, కనీసం పేద విద్యార్థులు విద్యనభ్యసించే గురుకులాల అద్దెలు చెల్లించలేని దుస్థితికి తెచ్చినట్లు నిలదీశారు. అంతేకాకుండా 2017లో దామగుండం అటవీ ప్రాంతంలో రాడార్ కేంద్రానికి అనుమతి ఇవ్వగా, దేశ రక్షణతో ముడిపడి ఉన్న ఈ అంశాన్ని కెటిఆర్ రాద్ధాంతం చేస్తున్నట్లు విమర్శించారు. పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా కేంద్రం రాడార్ కేంద్ర ఏర్పాటుకు ముందుకు రాగా, సిఎం రేవంత్‌రెడ్డికి ఆ ఘనత, క్రెడిట్ దక్కుతుందనే దురుద్దేశంతో ప్రజలను రెచ్చగొడుతూ లబ్ధిపొందే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో మున్సిపల్ మంత్రిగా ఉన్న కెటిఆర్ అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇచ్చి దండుకోగా, చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయమవుతున్న కారణంతో కాంగ్రెస్ సర్కార్ ఆక్రమణలను తొలిస్తుండడంతో తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఎద్దేవ చేశారు. ఉనికి కాపాడుకునేందుకు తెలంగాణ సెంటిమెంటును మరోసారి సొమ్ము చేసుకునే ప్రయత్నిస్తుండగా వారి అక్రమాలు, అవినీతిని ప్రజలు ఇప్పటికే గుర్తించినట్లు తెలిపారు. గత ప్రభుత్వ నిర్వాకంతో ఉద్యోగులకు జీతాలు, కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించలేని దుస్థితి దాపురించిందని, ఇప్పుడిప్పుడే రాష్ట్రం ఆదాయాన్ని పెంచుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, న్యాయవాది అశోక్‌రెడ్డి, నాయకులు సుఖేందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సుభాష్‌చంద్రబోస్, వెంకట్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రాములుగౌడ్, శివారెడ్డి, అంజద్, అశోక్, అంజాగౌడ్, నర్సింహారెడ్డి, బాలు, గణేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

**శివ్వంపేట, అక్టోబర్ 16 ( ప్రభాతవార్త ):** మండలంలోని దంతాన్‌పల్లి గ్రామనికి చెందిన గేడి జ్యోతి పాముకాటుతో మరణించినందున గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న పిఎసిఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి 5వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి అండగా ఉంటూ, సహాయసహకారాలు అందిస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు లింగం, నాయకులు గొల్ల నాగేందర్, నర్సింలు, దుర్గం అంజనేయులు, కంచన్‌పల్లి నర్సింలు, శివశంకర్, గొల్ల గణేష్, యాదగిరి, సిద్దిరాములు, కుల్ల పెంటయ్య, కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ నియామక పత్రాలు

**పుల్‌కల్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** డిఎస్‌సి 2024లో ఎంపికైన అభ్యర్థులకు బుధవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ, జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్‌లు నియామక పత్రాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి పుల్‌కల్ మండలంలో 9మంది అభ్యర్థులుగా ఎంపిక కాగా, మంత్రి ఎంపితో కలిసి నియామకప్రతాలు అందచేశారు. కార్యక్రమంలో టిపి ఐఐసి చైర్మన్ తూర్పు నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు పుల్‌కల్, చౌటకూరు మండలాల విద్యాధికారులు శంకర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను మోసగించిన గత పాలకులు

**గజ్వేల్ టౌన్, అక్టోబర్ 16 (ప్రభాతవార్త):** గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పక అమలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఊడెం సారిక శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ప్రజ్ఞాపూర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీ పథకాల్లో ఇందిరమ్మ ఇండ్ల పథకం మరో పది రోజుల్లో అమలు కానున్నదని, ఇండ్లు లేని నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, రెండో ప్రాధాన్యతలో భూమి ఉన్న వారికి ఇండ్లు కట్టించడం జరుగుతుందన్నారు. బిఆర్‌ఎస్ పార్టీ మోసాలను నమ్మకనే గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని తెలిపారు. ప్రజలు కోరుకున్న ఇందిరమ్మ పాలన సిఎం రేవంత్‌రెడ్డి కొనసాగిస్తున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డి సారధ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని పేర్కొన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పూర్తి చేయడానికి మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి వివరించినట్లు తెలిపారు.

## ప్రపంచ ఆహారదినోత్సవ వేడుకలు

**గజ్వేల్, అక్టోబర్ 16 (ప్రభాతవార్త):** గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల బాలుర సముదాయంలో మైక్రో బయాలజీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో అధ్యాపకురాలు టి.లావణ్య ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ నిక్కత్ అంజుం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆహారం విలువ తెలుసుకొని ఆహారాన్ని దుర్వినియోగం చేయకూడదని తెలిపారు. పోషక విలువలతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, ఐక్యూ ఏసి కో-ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు డాక్టర్ భవాని, కవిత, మార్కండేయ, రామచంద్రం, జ్యోతి, అలివేలు, పద్మ మహేందర్, మహేందర్‌రెడ్డి, నరేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ స్కాలర్‌షిప్‌లనువిడుదల చేయాలి

**గజ్వేల్, అక్టోబర్ 16 (ప్రభాతవార్త):** గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని సామాజిక హక్కుల సంఘం (సాహసం) జిల్లా అధ్యక్షుడు కానుగుల రమణాకర్ డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమణాకర్ మాట్లాడుతూ బిఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో విద్యార్థులను అనేక ఇబ్బందులకు గురిచేసిందని కాంగ్రెస్‌కు అధికారం కట్టబెడితే ప్రస్తుత ప్రభుత్వం కూడా విద్యార్థులకు న్యాయం చేయట్లేదని అన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే స్పందించి విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు

**నర్సాపూర్ అక్టోబర్ 16. ప్రభాతవార్త:** త్వరలో జరుగబోయే గ్రాడ్యుయేట్, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. బుదవారం నర్సాపూర్‌ఆర్డీవో కార్యాలయంలో గ్రాడ్యుయేట్, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబందించిన డిజిగ్నేటెడ్‌లుగా నియమితులైన అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నర్సాపూర్ డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కోసం మొత్తం 277 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందులో 51 దరఖాస్తులు ఆమోదించబడగా సరియైన ధృవపత్రాలు, ఫోటోలు సమర్పించని 4 దరఖాస్తులను తిరస్కరించడం జరిగిందని తెలిపారు. ఈమేరకు గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కోసం 2021 సంవత్సరం నవంబర్ 1 నాటికి డిగ్రీ పూర్తి చేసుకున్న వారు అర్హులని తెలిపారు. డిగ్రీ అర్హత కలిగిన వారు డిగ్రీ సర్టిఫికెట్ ను గెజిటెగడ్ ఆఫీసర్ ద్వార అటెస్టెడ్ చేయించుకొని ఫారం 18 ఆన్‌లైన్ లో గాని సంబందిత తహాశీల్దార్ కార్యాలయంలో గాని సమర్పించవచ్చని తెలిపారు. అలాగే ఉపాధ్యాయుల కౌన్సిల్ కోసం సెకండరీ స్కూల్ ఆ పైన విద్యాలయాల్లో పని చేసె ఉపాధ్యాయులు నవంబర్ 1 వ తేది 2021 నటికి 3 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసి ఉండాలన్నారు. ఈ మేరకుఅర్హులైన ఉపాధ్యాయులు ఫారం 19 లో దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. సర్వీస్ పూర్తి చేసినట్లు వారి యొక్క ప్రధానోపాధ్యాయుల, వారి కార్యాలయ అధిపతితో సంతకం తీసుకోవల్సి ఉంటుందని తెలిపారు. అయితే ఫోటోలు కచ్చితంగా క్లారిటీగా ఉండాలన్నారు. ఫోటోలు సరిగా లేకపోత, తిరస్కరించబడతాయని తెలిపారు. ఈమేరకు గ్రాడ్యుయేట్‌లు, ఉపాధ్యాయులు కౌన్సిల్‌లో ఓటరు నమోదు కోసం నవంబర్ 6 వ తేదీ వరకు గడువు ఉంటుందని తెలిపారు. ఈమేరకు వీలయినంత ఎక్కువమంది. అర్హులైన గ్రాడ్యుయేట్‌లు, ఉపాధ్యాయులు ఓటరు నమోదు కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి సూచించారు.

## సిబ్బందికి బట్టల పంపిణీ

**నర్సాపూర్ అక్టోబర్ 16. ప్రభాతవార్త:** నర్సాపూర్ సమీపంలోని బివిఆర్‌ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో బివిఆర్‌ఐటి వ్యవస్థాపక చైర్మన్ పద్మభూషణ్ డాక్టర్ బివిరాజు 104వ జయంతివేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బివిఆర్‌ఐటి వ్యవస్థాపక చైర్మన్ పద్మభూషణ్ డాక్టర్ బివిరాజు విగ్రమానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అంతేగాక శ్రీ విష్ణు విధ్యాసంస్థల సెక్రటరీ ఆదిత్య విస్సం చేతులమీదుగా బివిఆర్‌ఐటి కళాశాలలో పనిచేస్తున్న స్వీపర్లకు, డ్రైవర్లకు గార్డినర్‌లకు అందరికి బట్టలను పంపిణీ చేయడం జరిగింది. ఇదిలా వుండగా బివిఆర్‌ఐటి వ్యవస్థాపక చైర్మన్ పద్మభూషణ్ డాక్టర్ బివిరాజు పుట్టినరోజును పురస్కరించుకొని నర్సాపూర్‌లోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో, డంగోరియా ప్రసూతి ఆసుపత్రిలో, వృద్ధాశ్రమంలో రొట్టెలు, పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేయడం జరిగింది. ఈసందర్భంగా బివిఆర్‌ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో బివిఆర్‌ఐటి వ్యవస్థాపక చైర్మన్ పద్మభూషణ్ డాక్టర్ బివిరాజు 104వ పుట్టినరోజు వేడుకలను, అధ్యాపక బృందం, విధ్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ విష్ణు విధ్యాసంస్థల సెక్రటరీ ఆదిత్య విస్సంతో పాటు కళాశాల డైరక్టర్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబే లు మాట్లాడుతూ బివిరాజు కలలను సాకారం చేయడానికి మనమందరం కృషి చేయాలన్నారు.. ఈకార్యక్రమంలో అధ్యాపక బృందం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం

**నర్సాపూర్ అక్టోబర్ 16. ప్రభాతవార్త:** రీజినల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న భూనిర్వాసిత రైతులకు మార్కెట్ విలువ ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని. లేదా భూమికి బదులు భూమి ఇవ్వాలని బుదవారం నర్సాపూర్ మండల పరిధిలోని రెడ్డిపల్లి, చిన్నచింతకుంట గ్రామాల భూనిర్వాసిత రైతులు నర్సాపూర్‌లోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి కి ఒక వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈరెండు గ్రామాల్లో ట్రిబుల్ ఆర్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతుల భూముల విలువ బయట మార్కెట్ ధర 3 కోట్లు పలుకుతున్నందున ఇందుకు తగ్గట్లుగా కనీసం రెండుకోట్ల వరకైనా నష్ట పరిహారం చెల్లించాలని లేని పక్షంలో మేము కోల్పోతున్న భూములకు బదులుగా భూముల ఇవ్వాలని వారు కోరారు.